RNI No: TELTEL/2022/83073

# వేద న్యూస్

దినపత్రిక

వరంగల్
సంపుటి: 4 సంచిక:102

ఆదివారం
ఏప్రిల్ 05, 2026

పేజీలు 8
వెల: రూ.3-00

లింగబత్తిని కృష్ణ
సీఎండీ & ఎడిటర్
9701923260




## లవర్ ను టిఫిన్ కోసం పంపి..

### ఓయో రూమ్‌లో యువకుడి ఆత్మహత్య

2లో

- త్వరలో వివాహం జరగాల్సి ఉండగా విషాదం
- స్నేహితుడికి మెసేజ్ పంపి ఉరివేసుకున్న లోకేశ్

# కడుపులోనే.. చిదిమేస్తుండ్రు!

## డీజీపీ సర్.. ఆడపిల్లలను కాపాడుకుందాం



### క్షేత్రస్థాయిలో మీ ఉక్కుపాదం మోపాల్సిందే..



2లో

## రాష్ట్రంలో విచ్చలవిడిగా లింగ నిర్ధారణ

- స్కానింగ్ సెంటర్లలో 'మనీ మేకింగ్' మాఫియా
- డబ్బు కోసం పసిగుడ్ల ఊపిరి తీస్తూ దారుణం
- రాష్ట్రవ్యాప్తంగా సంచలమైన వరంగల్ ఘటన
- ఆడపిల్ల పుడుతుందని కుటుంబాన్నే బలిచేశాడు..
- ఈ ఘటనకు బాధ్యత ఎవరిది?
- లింగ నిర్ధారణతోనే మృత్యుపాశాలు
- క్షేత్రస్థాయిలో అధికారుల లోపమే అక్రమార్కులకు వరం

**వేద న్యూస్, ప్రత్యేక ప్రతినిధి**


రాష్ట్రంలో ఒకవైపు అభివృద్ధి పరుగులు తీస్తోంది.. మరోవైపు శాంతిభద్రతల పరిరక్షణలో పోలీస్ యంత్రాంగం సరికొత్త రికార్డులు సృష్టిస్తోంది. కానీ, అదే రాష్ట్రంలో నాగరిక సమాజం తలదించుకునేలా ఒక నిశ్శబ్ద మారణ కాండ సాగుతోంది. సాంకేతికత ప్రాణాలు పోయాల్సింది పోయి, పసి ప్రాణాలను చిదిమేయడానికి ఆయుధంగా మారుతోంది. కడుపులో ఉన్నది ఆడపిల్ల అని తెలియగానే, ఆ పసిమొగ్గ భూమి మీద అడుగుపెట్టకముందే హతమారుస్తున్నారు. కేవలం కొన్ని వేల రూపాయల కోసం వైద్యం ముసుగులో కొందరు కసాయిలుగా మారుతుంటే, ఆ అక్రమాలను అరికట్టాల్సిన వ్యవస్థలు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నాయి. వరంగల్ నుండి కరీంనగర్ దాకా వెలుగుచూసిన ఘోరాలు కేవలం నేరాలు మాత్రమే కాదు, మన వ్యవస్థలోని లోపాలకు నిలువుటద్దాలు. ఈ లింగ వివక్ష విషవృక్షం వేళ్లను నరికేయాలంటే ఇప్పుడు రాష్ట్ర పోలీస్ బాస్ నేరుగా రంగంలోకి దిగాల్సిన సమయం ఆసన్నమైంది.



## మాజీ సీఎం కేసీఆర్ క్యాంప్ ఆఫీస్‌పై దాడి

### సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలతోనే దాడులంటూ నేతల ఆరోపణ

- ప్రతిపక్ష నేతకే రక్షణ లేని దుస్థితిపై రాజకీయ వర్గాల ఆందోళన
- ప్రజాస్వామ్యంపై దాడిగా అభివర్ణన
- శాంతిభద్రతల వైఫల్యంపై గవర్నర్ జోక్యం చేసుకోవాలని డిమాండ్



2లో

## రేవంత్ రెడ్డి ఆదేశాలతోనే గూండాయిజం నడుస్తోంది

- ప్రజాప్రతినిధుల కార్యాలయాలపై దాడులు ప్రజాస్వామ్యానికే గొడ్డలిపెట్టు
- రాష్ట్రంలో శాంతిభద్రతలు ఉన్నాయా?
- హరీష్ రావు తీవ్ర ఆగ్రహం



2లో

# పశువుల మూగ రోదన

**వేద న్యూస్, బోయినిపల్లి**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండల కేంద్రంలోని పశువుల ఆసుపత్రి పరిస్థితి ఆందోళన కరంగా మారింది. రైతుల పశువులకు అత్యవసర వైద్య సేవలు అందించాల్సిన ఈ దవాఖాన తరచూ తాళం వేసి ఉండటం గమనార్హం. డాక్టర్ విధుల్లో ఉన్నారని చెబుతున్నప్పటికీ, ఆసుపత్రికి వెళ్లిన రైతులకు తలుపులు మూసి కనిపిస్తున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పశువులు అనారోగ్యానికి గురైతే ఆశతో తీసుకువచ్చినా, డాక్టర్ అందుబాటులో లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. 'ఎప్పుడు చూసినా తాళమే కనిపిస్తోంది. డాక్టర్ ఎప్పుడు వస్తాడో, ఎప్పుడు వెళ్తాడో తెలియడం లేదు' అంటూ రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పలుమార్లు వెళ్లినా ఇదే పరిస్థితి ఎదురవుతోందని చెబుతున్నారు. వైద్యుడు లేకపోవడంతో చివరకు ప్రైవేట్ వైద్యులను ఆశ్రయించాల్సి వస్తోందని, దీంతో అదనపు ఖర్చులు భరిస్తున్నామని రైతులు తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి, ఆసుపత్రిని నియమిత సమయాల్లో ప్రారంభించి, డాక్టర్‌ను అందుబాటులో ఉంచాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

## బోయినిపల్లి పశువుల ఆసుపత్రికి తరచూ తాళం

- ఎప్పుడొస్తారో తెలియని డాక్టర్‌తో రైతుల్లో అయోమయం
- ప్రైవేట్ వైద్యులవైపు పరుగులు..
- సేవలు పునరుద్ధరించాలని డిమాండ్



వేద న్యూస్

ఆదివారం | ఏప్రిల్ 05, 2026

# విలువల బోధ.. చంద్రబోస్ పాట

'మౌనంగానే ఎదగమని మొక్క నీకు చెపుతుంది..', 'ఎవరేమి అనుకున్నా నువ్వుండే రాజ్యాన రాజు నువ్వే బంటు నువ్వే..' , 'కొడితే కొట్టాలిరా సిక్స్ కొట్టాలి..', 'చీకటితో వెలుగే చెప్పెను నేనున్నానని..', 'లేలేలేలే ఇవ్వాళే లే..', 'ఎలా ఎలా ఎలా ఎలా తెలపను..', 'చీరలోని గొప్పదనం తెలుసుకో..', 'నాటు నాటు'..వంటి ఎన్నో చంద్రబోస్ పాటలు సినీ ప్రియులకు సుపరిచితం. మదర్స్ డే, ఇండిపెండెన్స్ డే, ఫేర్ వెల్ డే, మ్యారేజ్ సెలబ్రేషన్స్ డే.. ఏదైనా సరే.. చంద్రబోస్ పాటలు ఉండాల్సిందే అని చెప్పొచ్చు.తెలుగుతనం ఉట్టిపడే పాటలు రాస్తూ తనకంటూ ఒక ప్రత్యేకతను సంపాదించుకుని.. సినీ రంగంలోనే అత్యున్నతమైన ఆస్కార్ సాధించిన మట్టికవి చంద్రబోస్. 'సిరివెన్నెల' తర్వాత ఉదయించిన చంద్రుడు ఆయన.. సరళమైన శైలిలోనే రచన కొనసాగిస్తూనే ప్రతీ ఒక్కరిలో ఆలోచన కలిగేలా పాట రచన ఆయన శైలి ఎత్తుగడ అని చెప్పొచ్చు.

### మట్టిని మరువని మనిషి

జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలం చల్లగరిగె గ్రామంలో పుట్టిన ముప్పలనేని శివచంద్రబోస్ అలియాస్ చంద్రబోస్ ..ఉన్నత చదువుల కోసం చల్లగరిగెను వీడి భాగ్యనగరం వైపు పయనమయ్యారు. డిప్లొమా పూర్తి చేసి ఇంజినీరింగ్ చేస్తూనే తెలుగు సినీ రంగంలోకి అడుగుపెట్టారు. బీటెక్ పట్టభద్రుడైన ఆయన తెలుగు సినీ పాటకు శిఖరాగ్రస్థాయి గౌరవం..ఆస్కార్ ద్వారా తీసుకొచ్చారు. కథ సందర్భాన్ని ఆవిష్కరిస్తూనే.. భావ కవిత్వాన్ని రంగరిస్తూ..మట్టివాసనను వెండితెరపై పరిమళించేలా చేయడంలో ఆయన సిద్ధహస్తుడు. కథా నేపథ్యంలో అతిశయోక్తి అలంకారంలో తగు సందర్భ విలువలనూ జోడిస్తూ పాటను రక్తి కట్టించగల నేర్పరి ఆయన. 'మంచుకొండల్లోన చంద్రమా' అంటూ తొలి పాటలోనే చల్లటి మాధుర్యపు రసాన్ని పంచే చంద్రుడిలా వచ్చిన చంద్రబోస్ తెలుగు చిత్రసీమలో పాటకు మారుపేరుగా మారారు. 'సరిగమ పదనిస రాగం, త్వరపడుతున్నది మాఘం' అంటూ 'పెళ్లిసందడి' చిత్రంలో సిరివెన్నెల సీతారామశాస్త్రి, వేటూరి సుందరరామ్మూర్తిలతో పాటుగా ఓ గీతం చంద్రబోస్ రచించారు. శృంగారగీతంలోనూ మాధుర్యమే ధ్వనించేలా 'చాలు చాలు విరహాలు చాలు చాలు..' అంటూ సాగే పాటలో 'రామా' అనే పదమే ఆవిష్కృతమయ్యేలా అత్యంత అద్భుతంగా గీతాన్ని అందించారు. చిలిపి ఊహలకు తెరలేపుతూ.. సరదా పాటల రచనలో తన మార్క్ చూపించారు. యుగళ గీతాలతో యూత్‌ను కిర్రెక్కించడమే కాదు.. వారు మదిలో ధైర్యాన్ని నింపి ఆశయ బాట వైపు అడుగులు వేయాలని దిశానిర్దేశం చేసే స్నేహితుడి మాదిరిగా పాటలను పంపిస్తారు. 'చీకటితో వెలుగే చెప్పెను నేనున్నానని' చిత్రానికి రాసిన పాటను జీవితానికి అన్వయించుకున్నా కొండంత ధైర్యం నూరిపోసుకునేలా చక్కటి రచన చేశారు. 'నీరల్లే మారాలి అందరి దాహం తీర్చాలి' అంటూ సమాజంలో సహాయం చేసే తత్వం పెరిగేలా తాత్విక సందేశాన్ని అందించారు. కథా సందర్భాన్ని బట్టి తన పాటను పాత్ర్యాంశంగా భావించే స్ఫూర్తిదాయక గీతాలు ఆయన కలం నుంచి వచ్చాయి. 'మౌనంగానే ఎదగమని మొక్క నీకు చెబుతుంది' పాట ప్రతీ రోజూ ఓ పాఠశాలలో ప్రేయర్‌గా పాడుకోవడాన్ని బట్టి.. కవికి ఎంతటి స్థాయి పాండిత్యం, గౌరవం దక్కిందో అర్థం చేసుకోవచ్చు. ఇటీవల ఆయన 'చాంపియన్' చిత్రంలో తెలంగాణ మాండలికపు మట్టివాసనతో 'సల్లంగుండాలె సక్కంగుండాలె' సాంగ్ అందించారు. 'భర్త మహాశయులకు విజ్ఞప్తి' సినిమాలో 'అద్దం ముందర నిలబడి' పాటలో అతిశయోక్తితో కూడిన రచన చేసినా దాంపత్య విలువను తెలియజేప్పేలా రచన కొనసాగించారు. ప్రశ్న, జవాబుతో కూడిన ఎత్తుగడ పాటలో కనబడుతుంది. 'చల్లగాలి కావాలంటే చందమామను తీసుకొస్తాడే' అని భర్త తాలూకు గొప్పతనాన్ని భార్య వివరిస్తున్నట్టుగా చెబుతూనే.. నువ్వు రోజు చదివేదేంటి..అనే ప్రశ్నకు నీ పరువాల పత్రికని అని అన్యోన్య దాంపత్య బంధం గురించి వెల్లడించారు. చివరలో తన పంచ ప్రాణాల రూపాన్ని భార్యలో చూసుకుంటున్న భర్త మనసును పాటగా మలిచినట్లు స్పష్టంగా పేర్కొన్నారు. ఎన్నో అద్భుతమైన పాటలను రచించిన చంద్రబోస్.. రెండు నంది అవార్డులు, జాతీయ స్థాయి పురస్కారం అందుకున్నారు. ఆయన సాహితీ ప్రయాణం మరిన్ని శిఖరాగ్రాలు చేరాలని ఆశిస్తున్నాం.



అంబీర్ శ్రీకాంత్
సీనియర్ జర్నలిస్టు
81859 68059

# కడుపులోనే చిదిమేస్తుండ్రు!

**వేద న్యూస్, ప్రత్యేక ప్రతినిధి**



రాష్ట్రంలో శాంతిభద్రతల పరిరక్షణలో పోలీస్ యంత్రాంగం తనదైన ముద్ర వేస్తోంది. నేరగాళ్ల గుండెల్లో వణుకు పుట్టిస్తూ, ప్రజలకు భద్రతా భావాన్ని కల్పించడంలో డీజీపీ సారథ్యం ప్రశంసనీయం. అయితే, ఇన్ని జాగ్రత్తల మధ్య కూడా ఒక అమానుష నేరం సమాజపు పునాదులను తొలిచేస్తోంది. అదే.. లింగ నిర్ధారణ పరీక్షలు. ఒక పక్క టెక్నాలజీ పెరుగుతుంటే, మరోపక్క అదే టెక్నాలజీని వాడుకుని ఆడపిల్లలను భూమి మీదకు రాకుండానే కడుపులోనే చిదిమేస్తున్నారు. ఈ రక్తపాతాన్ని అడ్డుకోవాలంటే ఇప్పుడు పోలీసు శాఖ అత్యంత కఠినమైన నిర్ణయాలు తీసుకోవాల్సిన సమయం ఆసన్నమైంది. మాతృత్వాన్ని గౌరవించాల్సిన సమాజంలో, ఒక జీవిని భూమి మీదకు రానీయకుండా గర్భంలోనే చిదిమేసే అమానుష కాండ రాష్ట్రవ్యాప్తంగా నిశ్శబ్దంగా సాగుతోంది. నిబంధనలు ఎన్ని ఉన్నా, చట్టాలు ఎంత కఠినంగా మారుతున్నా.. 'లింగ నిర్ధారణ' అనే విషవృక్షం కోరలు చాస్తూనే ఉంది. కేవలం కొన్ని వేల రూపాయల కోసం పసి మొగ్గలను మట్టిలో కలిపేస్తున్న వైనంపై 'వేద న్యూస్' ప్రత్యేక కథనం.

### విచ్చలవిడిగా లింగ నిర్ధారణ

రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అనేక ప్రైవేట్ స్కానింగ్ సెంటర్లు, చిన్నపాటి ఆస్పత్రులు ఇప్పుడు మనీ మేకింగ్ సెంటర్లుగా మారిపోయాయి. సాధారణంగా ఒక గర్భిణికి స్కాన్ చేయడానికి అయ్యే ఖర్చు కంటే, లింగ నిర్ధారణ చేయడానికి రూ. 30 వేల నుంచి రూ. 50 వేల రూపాయల వరకు వసూలు చేస్తున్నారని సమాచారం. ఇది ఒక మాఫియాలా విస్తరించింది. గర్భిణిని తీసుకువచ్చే మధ్యవర్తులకు భారీగా కమీషన్లు ఇస్తూ ఈ దందాను యథేచ్ఛగా నడిపిస్తున్నారు. స్కానింగ్ రిపోర్టులో నేరుగా రాయకుండా, కేవలం సంకేతాల ద్వారా ( గవ్వలు, గాజులు, పండు అని) లోపల ఉన్నది ఆడపిల్ల అని నిర్ధారిస్తున్నారు.

### అధికారుల అండదండలు..

జిల్లా స్థాయిలో వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బంది పర్యవేక్షణ లోపం ఇక్కడ స్పష్టంగా కనిపిస్తోంది. చట్టం ప్రకారం ప్రతి స్కానింగ్ సెంటర్ ప్రతి నెలా నివేదిక ఇవ్వాలి, అధికారులు ఆకస్మిక తనిఖీలు చేయాలి. కానీ, క్షేత్రస్థాయిలో పరిస్థితి భిన్నంగా ఉంది. కొందరు అధికారులు ముడుపుల మత్తులో జోగుతూ, తనిఖీల సమాచారాన్ని ముందే సెంటర్ల నిర్వాహకులకు చేరవేస్తున్నారు. ఒకవేళ తీవ్రమైన ఒత్తిడి వల్ల ఏదైనా సెంటర్‌ను సీజ్ చేసినా, అది కేవలం కొన్ని రోజుల ప్రహసనమే అవుతోంది. కోర్టు మెట్లు ఎక్కకుండానే లేదా పైస్థాయి సిఫార్సులతో మళ్లీ ఆ సెంటర్లు యథేచ్ఛగా తెరుచుకుంటున్నాయి. ఈ 'సీజ్ అండ్ ఓపెన్' డ్రామా వల్ల చట్టం అంటే నిర్వాహకులకు భయం లేకుండా పోయింది.

### డీజీపీ సార్.. క్షేత్రస్థాయిలో లొసుగులను అరికట్టండి!



రాష్ట్రంలో శాంతిభద్రతలు పటిష్టంగా ఉన్నాయని మీరు భావిస్తున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో ఉన్న కొందరు అధికారులు, సిబ్బంది స్కానింగ్ సెంటర్ల నిర్వాహకులతో చేతులు కలుపుతున్నారు. తనిఖీలు కేవలం 'తూతూ మంత్రం'గానే సాగుతున్నాయి. ఒకవేళ పొరపాటున ఏదైనా సెంటర్‌ను సీజ్ చేసినా, రాజకీయ పరపతితోనో లేదా ముడుపులతోనో మళ్లీ కొన్ని రోజులకే అవి తెరుచుకుంటున్నాయి. ఈ లొసుగులే అక్రమార్కులకు వరంగా మారుతున్నాయి. దీనిపై మీరు ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

### అమానుషం వరంగల్, కరీంనగర్ ఘటనలు..

లింగ నిర్ధారణ కేవలం గర్భస్రావాలకే పరిమితం కావడం లేదు, అవి దారుణమైన హత్యలకు దారితీస్తున్నాయి. ఇటీవల వరంగల్లో జరిగిన ఘటనే దీనికి ఉదాహరణ. కడుపులో ఉన్నది ఆడపిల్ల అని తెలియగానే, ఇప్పటికే ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారనే నెపంతో భార్యను, తన ఇద్దరు బిడ్డలను దారుణంగా చంపి స్విమ్మింగ్ పూల్‌లో వేసిన ఘటన నాగరిక సమాజాన్ని తలదించుకునేలా చేసింది. కరీంనగర్ జిల్లాలో కన్నతండ్రి శ్రీశైలం తన కవల ఆడపిల్లలను బావిలో పడేసి చంపడం వెనుక ఉన్న ప్రధాన కారణం కూడా ఆడపిల్లలపై ఉన్న వివక్షే. గర్భంలో ఉన్నప్పుడు లింగ నిర్ధారణ ద్వారా తెలిసిన నిజం.. ఆ తర్వాత పుట్టిన బిడ్డలపై ద్వేషంగా మారి ఇలాంటి ఘోరాలకు పురిగొల్పుతోంది.

### అమానుషానికి బాధ్యులెవరు?

ఈ అమానుష ఘటనలకు బాధ్యత ఎవరిది? ఆడపిల్ల పుడుతుందని తెలిసి, కనికరం లేకుండా ఇద్దరు పసిబిడ్డలతో సహా భార్యను చంపేసిన ఒక దుర్మార్గపు తండ్రిదా? లేక పుట్టిన బిడ్డను చూసుకోలేక, భారం అనుకుని పసి ప్రాణాన్ని బలితీసుకున్న మరో కసాయి తండ్రిదా? నిజానికి ఈ దారుణాలన్నింటికీ మూలం వ్యవస్థలో వేళ్లూనుకున్న లోపాలే. నిబంధనలను బేఖాతరు చేస్తూ, కేవలం కాసుల కోసం లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తున్న స్కానింగ్ సెంటర్ల నిర్వాహకులది కాదా ఈ పాపం? అక్రమాలను అరికట్టడంలో విఫలమవుతూ, మామూళ్ల మత్తులో జోగుతున్న క్షేత్రస్థాయి అధికారుల నిర్లక్ష్యం దీనికి కారణం కాదా? పసి మొగ్గలను మట్టిలో కలిపేస్తున్న ఈ వ్యవస్థలో లోపాలను అడ్డంపెట్టుకుని అక్రమార్కులు సాగిస్తున్న ఈ దందాకు అడ్డుకట్ట వేయకపోతే, రేపు సమాజంలో ఆడబిడ్డల అస్తిత్వమే ప్రశ్నార్థకం కాక తప్పదు.



గర్భవతిగా ఉన్న తన భార్య కడుపులో ఆడపిల్లే ఉందని తెలుసుకుని మృగంగా మారిన ఓ మగాడి క్రూరత్వానికి బలైన భార్య, ఇద్దరు ఆడపిల్లలు..

## డీజీపీ సర్.. ఆడపిల్లలను కాపాడుకుందాం

## క్షేత్రస్థాయిలో మీ ఉక్కుపాదం మోపాల్సిందే

### రాష్ట్రంలో విచ్చలవిడిగా లింగ నిర్ధారణ

- స్కానింగ్ సెంటర్లలో 'మనీ మేకింగ్' మాఫియా
- డబ్బు కోసం పసిగుడ్ల ఊపిరి తీస్తూ దారుణం
- రాష్ట్రవ్యాప్తంగా సంచలమైన వరంగల్ ఘటన
- ఆడపిల్ల పుడుతుందని కుటుంబాన్నే బలిచేశాడు..
- ఈ ఘటనకు బాద్యత ఎవరిది?
- లింగ నిర్ధారణతోనే మృత్యుపాశాలు
- క్షేత్రస్థాయిలో అధికారుల లోపమే అక్రమార్కులకు వరం

### కుటుంబాల్లో చిచ్చు.. ఆరని చితి మంటలు

లింగ నిర్ధారణ పరీక్షల వల్ల కలిగే మానసిక వేదన వర్ణనాతీతం. భార్య గర్భం దాల్చిన పుటి నుండి 'ఆడపిల్ల పుడితే భారం' అనే భావనను భర్త లేదా అత్తమామలు ఇంజెక్ట్ చేస్తున్నారు. ఆడపిల్ల అని తెలిసిన మరుక్షణం నుండి ఆ గర్భిణిపై శారీరక, మానసిక దాడులు మొదలవుతున్నాయి. బలవంతపు అబార్షన్లు చేయించడం వల్ల చాలామంది మహిళలు ప్రాణాపాయ స్థితిలోకి వెళ్తున్నారు. కొన్ని సందర్భాల్లో తల్లీ బిడ్డలిద్దరూ బలవుతున్నారు. ఒక తరం ఆడపిల్లలను ఇలా కడుపులోనే చంపేయడం వల్ల భవిష్యత్తులో లింగ నిష్పత్తి దారుణంగా పడిపోయే ప్రమాదం పొంచి ఉంది.

# రేవంత్ రెడ్డి ఆదేశాలతోనే గూండాయిజం నడుస్తోంది

- ప్రజాప్రతినిధుల కార్యాలయాలపై దాడులు ప్రజాస్వామ్యానికే గొడ్డలిపెట్టు
- రాష్ట్రంలో శాంతిభద్రతలు ఉన్నాయా?
- హరీష్ రావు తీవ్ర ఆగ్రహం


**వేద న్యూస్, హైదరాబాద్**

మాజీ ముఖ్యమంత్రి, గజ్వేల్ ఎమ్మెల్యే కేసీఆర్ క్యాంప్ కార్యాలయంపై కాంగ్రెస్ శ్రేణులు జరిపిన దాడిని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావు తీవ్రంగా ఖండించారు. ఈ దాడి ముమ్మాటికీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాలతోనే జరిగిందని ఆయన ఆరోపించారు. పట్టపగలు అధికార మదంతో విర్రవీగుతూ కాంగ్రెస్ నాయకులు వ్యవహరిస్తున్న తీరు బీహార్ గ్యాంగ్‌లను తలపిస్తోందని మండిపడ్డారు. ఏకంగా ప్రజాప్రతినిధుల క్యాంప్ కార్యాలయాలపైనే ముప్పేట దాడులు జరుగుతుంటే, రాష్ట్రంలో అసలు శాంతిభద్రతలు ఉన్నాయా లేవా అని హరీష్ రావు ప్రశ్నించారు. కాంగ్రెస్ పాలనలో దాడులు నిత్యకృత్యం కావడం సిగ్గుచేటని ఆయన ధ్వజమెత్తారు. శాంతిభద్రతలను కాపాడాల్సిన పోలీసు యంత్రాంగం కాంగ్రెస్ పార్టీకి ప్రైవేట్ సైన్యంలా మారిపోయిందని హరీష్ రావు విమర్శించారు. దాడులు జరుగుతున్నా పోలీసులు ఎందుకు అడ్డుకోవడం లేదని నిలదీశారు. ఒకవైపు 'హేట్ స్పీచ్ బిల్' పేరుతో ప్రతిపక్షాల నోళ్లు మూయిస్తూ, మరోవైపు కాంగ్రెస్ గూండాలతో దాడులు చేయించడమేనా మీ 'ప్రజా పాలన' అని ముఖ్యమంత్రిని ప్రశ్నించారు. ఇందిరమ్మ రాజ్యం అని చెబుతూ గూండా రాజ్యాన్ని అమలు చేస్తున్నారని ఆరోపించారు. ముఖ్యమంత్రి, మంత్రులు ఇతర రాష్ట్రాల్లో రాజకీయ పర్యటనలు చేస్తూ ఇక్కడ పాలనను గాలికి వదిలేశారని ఆయన ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేల కార్యాలయాలపై దాడులు చేయాలని కాంగ్రెస్ నాయకులకు సీఎం ఫ్రీ హ్యాండ్ ఇచ్చారా అని హరీష్ రావు అనుమానం వ్యక్తం చేశారు. ఏడవ గ్యారంటీగా ప్రజాస్వామ్య పునరుద్ధరణ అని డబ్బా కొట్టి, ఇప్పుడు ఉన్న ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారని విమర్శించారు. ప్రస్తుత పరిస్థితులు ఎమర్జెన్సీ పాలనను తలపిస్తున్నాయని, ఇటువంటి అణచివేతలకు, నిర్బంధాలకు బీఆర్ఎస్ పార్టీ అదరదు బెదరదని ఆయన స్పష్టం చేశారు. ప్రజాక్షేత్రంలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని అడుగడుగునా నిలదీస్తామని, ప్రజల తరపున పోరాటం కొనసాగిస్తామని హరీష్ రావు తేల్చి చెప్పారు. ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంపై దాడికి పాల్పడిన కాంగ్రెస్ గూండాలను గుర్తించి వెంటనే అరెస్ట్ చేయాలని రాష్ట్ర డీజీపీని హరీష్ రావు డిమాండ్ చేశారు. ఇలాంటి దాడులను వెంటనే అరికట్టకపోతే ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు ప్రజలే వీధుల్లోకి రావాల్సిన పరిస్థితి వస్తుందని హెచ్చరించారు. తస్మాత్ జాగ్రత్త అంటూ ప్రభుత్వానికి హెచ్చరికలు జారీ చేశారు.

# కేసీఆర్ క్యాంప్ ఆఫీస్‌పై దాడి

**వేద న్యూస్, హైదరాబాద్**

- సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలతోనే దాడులంటూ నేతల ఆరోపణ
- ప్రతిపక్ష నేతకే రక్షణ లేని దుస్థితిపై రాజకీయ వర్గాల ఆందోళన
- ప్రజాస్వామ్యంపై దాడిగా అభివర్ణన
- శాంతిభద్రతల వైఫల్యంపై గవర్నర్ జోక్యం చేసుకోవాలని డిమాండ్



గజ్వేల్‌లోని మాజీ ముఖ్యమంత్రి, ప్రతిపక్ష నేత కేసీఆర్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంపై కాంగ్రెస్ శ్రేణులు జరిపిన దాడి రాష్ట్రవ్యాప్తంగా కలకలం రేపింది. ఈ ఘటన కేవలం ఒక కార్యాలయంపై జరిగిన దాడి మాత్రమే కాదని, ఇది ముమ్మాటికీ ప్రజాస్వామ్యంపై జరిగిన దాడి అని రాజకీయ విశ్లేషకులు మరియు ప్రతిపక్ష నేతలు అభివర్ణిస్తున్నారు. రాష్ట్రంలో సాక్షాత్తు ప్రతిపక్ష నేతకే రక్షణ కల్పించలేని దుస్థితిలో ప్రభుత్వం మరియు హోం శాఖ ఉండటం శోచనీయమని వారు మండిపడుతున్నారు. ఉన్నత స్థాయి నాయకుడి కార్యాలయంపైనే ఇలాంటి దాడులు జరిగితే, ఇక సామాన్య ప్రజల పరిస్థితి ఏమిటన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. రాష్ట్రంలో గత కొంతకాలంగా ప్రతిపక్ష నాయకులు, ప్రజా సంఘాలు, నిరుద్యోగులు మరియు మీడియా ప్రతినిధులపై దాడులు నిత్యకృత్యమయ్యాయని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ దాడి వెనుక ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాలు ఉన్నాయని, ఆయన ప్రోత్సాహంతోనే కాంగ్రెస్ శ్రేణులు బరితెగిస్తున్నాయని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి. ప్రజలకు సంక్షేమం మరియు అభివృద్ధి ఫలాలు అందించడంలో విఫలమైన ప్రభుత్వం, తమ వైఫల్యాలను ప్రశ్నిస్తున్న నాయకులపై దాడులు చేస్తూ పైశాచిక ఆనందం పొందుతోందని ధ్వజమెత్తారు. ఇటువంటి చిల్లర రాజకీయాలు ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టు అని వారు హెచ్చరించారు. శాంతిభద్రతల పరిరక్షణలో ప్రస్తుత ప్రభుత్వం మరియు హోం శాఖ పూర్తిగా విఫలమయ్యాయని నిరసనకారులు పేర్కొంటున్నారు. రాష్ట్రంలో అరాచక శక్తులు పెచ్చుమీరుతున్నా పోలీసులు ప్రేక్షక పాత్ర వహిస్తున్నారని, ఇది ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని విమర్శించారు. ముఖ్యమంత్రి తన అధికారాన్ని ప్రతిపక్షాలను అణచివేయడానికి ఉపయోగిస్తున్నారని, ఇందిరమ్మ రాజ్యం అని చెబుతూ గూండా రాజ్యాన్ని నడుపుతున్నారని ఆరోపించారు. ఈ దాడిని తీవ్రంగా ఖండిస్తూ, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ రాష్ట్రవ్యాప్తంగా నిరసన సెగలు వ్యక్తమవుతున్నాయి. ఈ క్రమంలో రాష్ట్ర గవర్నర్ వెంటనే జోక్యం చేసుకోవాలని బాధితులు మరియు రాజకీయ నేతలు కోరుతున్నారు. గజ్వేల్ దాడిపై సమగ్ర దర్యాప్తు జరిపించి, దాడికి పాల్పడిన వారితో పాటు వారిని ప్రోత్సహించిన సూత్రధారులను కూడా కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తున్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతలను కాపాడలేని ఈ ప్రభుత్వాన్ని వెంటనే బర్తరఫ్ చేయాలని గవర్నర్‌కు విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రజాస్వామ్య విలువలను కాపాడేందుకు రాజ్యాంగబద్ధమైన చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో ప్రజలే వీధుల్లోకి వచ్చి ప్రభుత్వాన్ని నిలదీస్తారని హెచ్చరించారు. ఈ ఘటనతో గజ్వేల్‌లో ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతున్నాయి.

# లవర్‌ను టిఫిన్ కోసం పంపి..

### ఓయో రూమ్‌లో యువకుడి ఆత్మహత్య

**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి**

కేపీహెచ్‌బీ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఒక ఓయో గదిలో పెళ్లి పీటలు ఎక్కాల్సిన యువకుడు ఆత్మహత్యకు పాల్పడటం స్థానికంగా కలకలం రేపింది. అనంతపురం జిల్లాకు చెందిన వనమాల లోకేశ్ అనే యువకుడు, తాను ప్రేమించిన అంబికతో కలిసి అడ్డగుట్టలోని ఒక హోటల్ గదిని అద్దెకు తీసుకున్నాడు. కొద్దిసేపటి తర్వాత తనకు ఆకలిగా ఉందని, టిఫిన్ తీసుకురావాలని ప్రియురాలిని బయటకు పంపి, గదిలో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ప్రాణాలు విడిచాడు. వివాహానికి ఇరు కుటుంబాల పెద్దలు అంగీకరించిన తరుణంలో ఈ దారుణ ఘటన చోటుచేసుకోవడం పెను విషాదాన్ని నింపింది. లోకేశ్ గత కొంతకాలంగా చింతల్ గణేష్ నగర్‌లో నివసిస్తూ ఉద్యోగ ప్రయత్నాలు చేస్తున్నాడు. గతంలో పనిచేసిన చోట అంబికతో ఏర్పడిన పరిచయం ప్రేమగా మారింది. వీరిద్దరి ప్రేమను అంగీకరించిన పెద్దలు త్వరలోనే వివాహం చేసేందుకు నిశ్చయించారు. పెళ్లికి అన్ని అడ్డంకులు తొలగిపోయి, కొత్త జీవితం ప్రారంభించాల్సిన సమయంలో లోకేశ్ ఎందుకు ఇంతటి కఠిన నిర్ణయం తీసుకున్నాడనేది ఇప్పుడు మిస్టరీగా మారింది. ఆత్మహత్యకు కొద్ది నిమిషాల ముందు అతను తన స్నేహితుడికి వాట్సాప్‌లో 'మిస్ యూ బాయ్' అని మెసేజ్ పంపి, తన లొకేషన్‌ను షేర్ చేసినట్లు ప్రాథమిక విచారణలో వెల్లడైంది. టిఫిన్ తీసుకుని తిరిగి వచ్చిన అంబిక, గది తలుపులు లోపలి నుంచి గడియ పెట్టి ఉండటంతో ఆందోళనకు గురైంది. ఎంత పిలిచినా లోపలి నుంచి స్పందన లేకపోవడంతో హోటల్ సిబ్బందికి సమాచారం అందించింది. వారు వచ్చి తలుపులు బద్దలు కొట్టి చూడగా, అప్పటికే లోకేశ్ ఫ్యాన్‌కు ఉరివేసుకుని వేలాడుతూ కనిపించాడు.

# డ్యాన్స్ అండ్ ఫిట్ నెస్ మీ కలనా?



- ఆ డ్రీమ్ సాకారానికి చక్కటి అవకాశం
- ప్రసంగి డ్యాన్స్ స్టూడియో అండ్ ఫిట్ నెస్ సెంటర్ లో సమ్మర్ క్యాంప్
- అందుబాటులో లిమిటెడ్ సీట్లు మాత్రమే
- ఈ నెల 20 నుంచి క్లాసెస్
- మాస్టర్ ప్రసంగి వెల్లడి

**వేద న్యూస్, జమ్మికుంట:**

'డ్యాన్స్ అండ్ ఫిట్ నెస్" మీ కలనా?.. అయితే, ఆ కలను మీరు చక్కగా ఈ సమ్మర్ హాలి డేస్ లో సాకారం చేసుకోవచ్చు. జమ్మికుంట పట్టణంలోని ప్రసంగి డ్యాన్స్ స్టూడియో, ఫిట్ నెస్ సెంటర్ సహకారంతో.. మీరు డ్యాన్స్ లో రాణించవచ్చు. జమ్మికుంట పట్టణ, మండల, పరిసర ప్రాంత ప్రజలు.. పిల్లలతో పాటు పెద్దలకు కూడా ప్రసంగి డాన్స్ స్టూడియో లో క్లాసెస్ నిర్వహించనున్నారు. ఈనెల 20 నుంచి ప్రసంగి డ్యాన్స్ స్టూడియోలో సమ్మర్ క్యాంపును ప్రారంభించనున్నారు. లిమిటెడ్ సీట్లు మాత్రమే డాన్స్ స్టూడియోలో అందుబాటులో ఉన్నాయ నీ, ఆసక్తి గలవారు స్టూడియోను సంప్రదించవచ్చనీ స్టూడియో ప్రొప్రైటర్ శ్రీలత తెలిపారు. సమ్మర్ క్యాంపు తో పాటు రెగ్యులర్ గ్లాసెస్ కూడా ఉంటాయని, జుంబా డ్యాన్స్ కూడా నేర్పించనునట్టు వెల్లడించారు. వెస్ట్రన్, క్లాసికల్ , ఫోక్, బ్రేక్, ఫ్రీ స్టైల్, సినీ, లిరికల్ డాన్స్ స్టైల్స్ తో పాటు కరాటే సెల్ఫ్ డిఫెన్స్ క్లాసెస్, టెక్నిక్స్ కూడా నేర్పిస్తామని తెలిపారు. బర్త్డే పార్టీస్, వార్షికోత్సవాలు, సంగీత్, ఫేర్వెల్ పార్టీస్ తో పాటు అన్ని రకాల ఈవెంట్స్ కి డ్యాన్స్ నేర్పించనున్నట్టు స్పష్టం చేశారు. స్టేట్ , నేషనల్ డాన్స్ పోటీలలో చాంపియన్ అవార్డ్స్ తీసుకున్న విద్యార్థులు, పలువురు ప్రసంగి డాన్స్ స్టూడియో లో డాన్స్ నేర్చుకున్న వారు ఉన్నారని ప్రముఖ డాన్స్ మాస్టర్, కొరియోగ్రాఫర్, మాస్టర్ ప్రసంగి తెలిపారు. మరిన్ని వివరాలకు 9573551643,9573831643 ఫోన్ నంబర్ల ను సంప్రదించవచ్చు.

# దుర్గ ఆసుపత్రిలో గుండె వైద్య నిపుణులు

- ప్రతి నెల 2 వ, 4వ బుధవారం అందుబాటులో..
- హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ కిరణ్ గౌడ్ వెల్లడి




**వేద న్యూస్, జమ్మికుంట:**

జమ్మికుంట పట్టణ, మండల, పరిసర ప్రాంత ప్రజలకు గుండె సంబంధిత వ్యాధులకు , అనారోగ్య సమస్యలకు ట్రీట్మెంట్ అందించేందుకు దుర్గ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్వాహకులు ముందుకొచ్చారు. కొండూరి కాంప్లెక్స్ జమ్మికుంట పట్టణంలోని దుర్గ ఆస్పత్రిలో ఈ నెల 8న (బుధవారం) మధ్యాహ్నం 1 గంటల నుండి సాయంత్రం 4గంటల వరకు కన్సల్టెంట్ ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్ట్ , ప్రముఖ గుండె వైద్య నిపుణులు డా. కే సురేష్ కుమార్ ఎంబీబీఎస్, ఎం డి, డీ ఎం (కార్డియాలజీ) అందుబాటులో ఉంటారని ఆస్పత్రి మేనేజింగ్ డైరెక్టర్ పి. కిరణ్ గౌడ్ తెలిపారు. ఎవరైనా గుండెకు సంబంధించిన వ్యాధులతో బాధపడుతున్నవారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు 9059337824, 9866237824, 9652790784.. ఫోన్ నెంబర్లను సంప్రదించవచ్చని స్పష్టం చేశారు. ప్రతి నెల 2 వ, 4వ బుధవారం డాక్టర్ సురేష్ కుమార్ అందుబాటులో ఉంటారని ఆస్పత్రి మేనేజింగ్ డైరెక్టర్ పి కిరణ్ గౌడ్ వెల్లడించారు

# సురక్షిత సమాజం కోసం సీసీ కెమెరాలు అవసరం

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్
- దర్యాప్తు ఎంతో కీలకం..
- ఎస్పీ బి. మహేశ్ గితే



**వేద న్యూస్, రుద్రంగి:**

రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన 24 సీసీ కెమెరాలను జిల్లా ఎస్పీ మహేష్ బి. గితేతో కలిసి ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా సీసీ కెమెరాల ఏర్పాటుకు ముందుకు వచ్చి 24 కెమెరాలు ఏర్పాటు చేసిన మార్గం గోపిని ఆయన అభినందించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ.. గతంతో పోలిస్తే ప్రస్తుతం పోలీసింగ్‌లో విప్లవాత్మక మార్పులు వచ్చాయని తెలిపారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ పోలీసు శాఖ నేరాల నియంత్రణలో ముందంజలో ఉందన్నారు. నేరాలను ముందుగానే నివారించడంతో పాటు, కేసుల ఛేదనలో కూడా సీసీ కెమెరాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని పేర్కొన్నారు. ప్రజలు, వ్యాపారవేత్తలు, ప్రజాప్రతినిధులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి తమ పరిసరాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని ఆయన పిలుపునిచ్చారు. జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే మాట్లాడుతూ.. సీసీ కెమెరాలు నేరాలను అరికట్టడమే కాకుండా, జరిగిన ఘటనలపై వేగంగా దర్యాప్తు చేయడంలో కూడా ఎంతో ఉపయోగపడుతున్నాయని తెలిపారు. ప్రజల సహకారంతో ప్రతి గ్రామం, ప్రతి వీధిలో సీసీ కెమెరాల ఏర్పాటు జరిగితే సమాజం మరింత సురక్షితంగా మారుతుందని అన్నారు. అదే కార్యక్రమంలో మండల ప్రజల సౌకర్యార్థం రుద్రంగి మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన బస్ స్టాండ్‌ను కూడా ప్రారంభించారు. ఈ బస్ స్టాండ్ ప్రారంభంతో మండల ప్రజలకు రవాణా సౌకర్యాలు మరింత మెరుగుపడనున్నాయని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణాలకు వెళ్లే ప్రయాణికులకు ఇది ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని చెప్పారు. ప్రయాణికులు, ముఖ్యంగా మహిళలు సురక్షితంగా ప్రయాణం చేసేందుకు పోలీస్ శాఖ సమర్థవంతమైన రక్షణా చర్యలు తీసుకుంటుందని అధికారులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ శ్రీనివాస్, సీఐ వెంకటేశ్వర్లు, తహసీల్దార్ పుష్పలత, ఎంపీడీఓ నటరాజ్, ఎస్సైలు మోతిలాల్, రమేష్, సర్పంచ్ నారాయణ, ఉపసర్పంచ్ అభిలాష్ తదితర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# ఈ-సేవ కేంద్రం ఏర్పాటు చేయాలి

- సీపీఎం మండల కన్వీనర్ గురజాల శ్రీధర్



**వేద న్యూస్, వేములవాడ రూరల్:**

రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలో ప్రభుత్వ ఈ-సేవ కేంద్రాన్ని తక్షణమే ఏర్పాటు చేయాలని సీపీఎం మండల కన్వీనర్ గురజాల శ్రీధర్ డిమాండ్ చేశారు. శనివారం రత్నంపేటలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వేములవాడ, వేములవాడ రూరల్, చందుర్తి, రుద్రంగి, బోయినిపల్లి మండలాల ప్రజలు చిన్న పనులకైనా సిరిసిల్లకు వెళ్లాల్సి వస్తోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక ప్రైవేట్ మీ-సేవ కేంద్రాలు నిబంధనలకు విరుద్ధంగా అధిక ఛార్జీలు వసూలు చేస్తున్నాయని ఆరోపించారు. ప్రభుత్వం స్పందించి వేములవాడ పట్టణంలో ప్రభుత్వ ఈ-సేవ కేంద్రాన్ని యుద్ధ ప్రాతిపదికన ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు గిరిబాబు, శ్రీకాంత్, ప్రభాకర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# బోయినిపల్లి ఎమ్మార్వో, ఆర్ఐపై గ్రామస్తుల ఫిర్యాదు

**వేద న్యూస్, బోయినిపల్లి:**



- జాయింట్ కలెక్టర్ దృష్టికి రామాలయ భూమి వివాదం

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం నీలోజిపల్లి గ్రామంలో రామాలయ భూమిపై అక్రమాలు జరిగాయని ఆరోపిస్తూ గ్రామస్తులు ఎమ్మార్వో, ఆర్ఐలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లా కలెక్టర్ అందుబాటులో లేకపోవడంతో జాయింట్ కలెక్టర్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. గ్రామంలోని పురాతన రామాలయాన్ని ఒక వ్యక్తికి చెందినదిగా పేర్కొంటూ ఎమ్మార్వో ఆర్డర్ కాపీ ఇవ్వడం పట్ల గ్రామ ప్రజల్లో ఆందోళన నెలకొంది. ఆ ఆర్డర్‌ను వెంటనే రద్దు చేసి, బాధ్యులైన ఎమ్మార్వో, ఆర్ఐలను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ సానుకూలంగా స్పందించి, తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. గ్రామ ప్రజలు తమకు తక్షణ న్యాయం చేయాలని కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, మండల అధ్యక్షుడు కొండయ్య, సర్పంచ్ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# లార్డ్ వృద్ధాశ్రమంలో ఆర్డీవో జన్మదిన వేడుకలు

**వేద న్యూస్, హనుమకొండ:**



హనుమకొండ ఆర్డీవో రమేష్ రాథోడ్ జన్మదినోత్సవాన్ని కే.యూ సమీపంలోని లార్డ్ వృద్ధాశ్రమంలో ఘనంగా నిర్వహించారు. డాక్టర్ అనితా రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వృద్ధుల మధ్య కేక్ కట్ చేసి, అనంతరం అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా వృద్ధులకు బెడ్‌షీట్లు, పండ్లు, స్వీట్లు అందజేసి వారితో కలిసి భోజనం చేశారు. ఆర్డీవో రమేష్ రాథోడ్ మాట్లాడుతూ, తన జన్మదినాన్ని వృద్ధుల మధ్య జరుపుకోవడం ఆనందంగా ఉందన్నారు. మానవ సేవే మాధవ సేవ అని, వృద్ధులను గౌరవంగా చూసుకోవాలని పిలుపునిచ్చారు. వృద్ధులకు సమస్యలు ఎదురైతే ట్రిబ్యునల్ కోర్టును ఆశ్రయించాలని సూచించారు. డాక్టర్ అనితా రెడ్డి మాట్లాడుతూ.. అధికారులు తమ ముఖ్యమైన రోజులను వృద్ధుల మధ్య జరుపుకోవడం అభినందనీయమని అన్నారు. వృద్ధుల సేవ దైవసేవ అని, ప్రతి ఒక్కరూ వారికి ప్రేమతో వ్యవహరించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మమత, రాఘవ తదితరులు పాల్గొన్నారు.

# వరంగల్‌లో ఉత్సాహంగా 'రన్ ఫర్ జీసస్'

**వేద న్యూస్, వరంగల్:**



ఈస్టర్ పర్వదినాన్ని పురస్కరించుకొని వరంగల్ నగరంలో ఖిలా వరంగల్ మండల్ పాస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో 'రన్ ఫర్ జీసస్' శాంతి ర్యాలీని ఘనంగా నిర్వహించారు. ఈ ర్యాలీని డివైన్ గ్రేస్ అసెంబ్లీ చర్చి వ్యవస్థాపకులు దైవజనులు రమేష్ పాల్ ఆర్‌టీఏ జంక్షన్ వద్ద జెండా ఊపి ప్రారంభించారు. ఆర్‌టీఏ జంక్షన్ నుంచి హన్మకొండ వరకు సాగిన ఈ ర్యాలీలో నగరంలోని వివిధ చర్చిలకు చెందిన క్రైస్తవులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రమేష్ పాల్ మాట్లాడుతూ, సమాజంలో పెరుగుతున్న హింస, ద్వేషం తగ్గి శాంతి నెలకొనాలని ప్రార్థిస్తున్నామని తెలిపారు. "మన దేశం అంటే మట్టి కాదు, మనుషులు. అందరం కలిసిమెలిసి ప్రేమతో జీవించాలి" అని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పాస్టర్ శామ్యూల్, మహేందర్ పాల్, సూర్య, శ్రీనివాస్ పాల్, జోసెఫ్ తదితరులు పాల్గొన్నారు.

# నృత్య కళాకారులకు అభినందనలు

**వేద న్యూస్, మెట్‌పల్లి:**



శ్రీరామనవమి సందర్భంగా అరుణా చలం దేవస్థానం ఆధ్వర్యంలో ఫిబ్రవరి 27న నిర్వహించిన నృత్య కార్యక్రమంలో మెట్‌పల్లి పట్టణానికి చెందిన నటరాజ నృత్య కళానిలయం చిన్నారులు ప్రదర్శన ఇచ్చారు. ఈ సందర్భంగా వారికి బంగారు పతకాలతో సన్మానం చేశారు. తాజాగా ఆ చిన్నారులను కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ జువ్వాడి నర్సింగ్ రావు కలిసి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

# భయం గుప్పిట్లో చిన్నారుల విద్యాభ్యాసం

- పెచ్చులు ఊడుతున్న అంగన్వాడీ భవనం పై కప్పు
- పట్టించుకోని అధికారులు






**వేద న్యూస్, రుద్రూర్ :**

రుద్రూర్ మండల కేంద్రంలోని అంగడి బజార్ లో ని అంగన్వాడీ కేంద్రం-2 భవనం పై కప్పు నుండి పెచ్చులు ఊడి పడుతున్నాయని, ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తోందోనని అంగన్వాడీ టీచర్ తో పాటు చిన్నారులు వారి తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే ఈ భవనం పెచ్చులు ఊడిపడిన సంఘటనలు ఉన్నాయని అంగన్వాడీ టీచర్ పేర్కొన్నారు. అంగన్వాడీ కేంద్రాల పై అధికారుల పర్యవేక్షణ కరువైందని, అధికారులు పట్టించుకోవడం లేదని చిన్నారుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. అంగన్వాడి కేంద్రంలో -2 లో భవనంపై కప్పు నుండి పెచ్చులు ఊడి కింద పడుతున్నాయని, దీంతో చేసేదేమీ లేక భయం గుప్పిట్లోనే చిన్నారుల విద్యాభ్యాసం కొనసాగుతోంది. ఇప్పటికైనా అధికారులు వెంటనే స్పందించి అంగన్వాడీ కేంద్రం భవనం పై కప్పుకు మరమ్మతులు చేయించాలని పలువురు కోరారు.

# మొండి బకాయిలు వసూలు చేస్తే తప్పేనా

- నా మీద కక్ష కట్టి అసత్య ఆరోపణలు
- లక్ష్మీదేవిగూడెం వివోఏ ముత్యాల సరిత ఆవేదన

**వేద న్యూస్,నల్లగొండ ప్రత్యేక ప్రతినిధి :**



మొండి బకాయిలను వసూలు చేయడంతో కొంతమంది సభ్యురాలు కక్షగట్టి తన మీద తప్పుడు వార్తలను చిత్రీకరించి ఇబ్బందులు పెడుతున్నారని లక్ష్మీదేవి గూడెం వివోఏ ముత్యాల సరిత అన్నారు. శనివారం వేములపల్లి మండల కేంద్రంలోని తన నివాసంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. మొండి బకాయిలను వసూలు చేయడం తప్పు... కొంతమంది సభ్యురాలు తన వ్యక్తిగత పనులకు ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మొండిబకాయలను క్లియరెన్స్ చేస్తున్నాననే నేపథ్యంతోనే నా మీద ఇలాంటి ఆరోపణలు పూనుకున్నారని అన్నారు. లోన్లు కట్టని వారే నాపై దుష్ప్రచారం చేస్తున్నారని ఆమె ఆరోపించారు.ఒక సంవత్సరం నుంచే శ్రీనిధి రికవరీ 18 శాతం నుండి 85 శాతానికి పెంచామని పేర్కొన్నారు.నాపై అవినీతికి పాల్పడినట్లు అభియోగం చేసిన నేను బాధపడను..నేను సభ్యురాలకు అన్యాయం జరుగుతే ఆరోపణలు నిజమైతే స్వయంగా తప్పుకుంటానికి స్పష్టం చేశారు.ఈ సమావేశంలో సంఘ బంధం అధ్యక్షురాలు చెన్నబోయిన లక్ష్మి, కార్యదర్శి ఇటమల్ల శిల్ప, ముత్యాల వెంకటమ్మ, లింగమ్మ, నవ్య, మౌనిక, సుజాత,రత్నబాయి తదితరులు పాల్గొన్నారు.

# క్యాతనపల్లి మున్సిపల్ పాలకవర్గం ఎన్నిక

- అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి. చంద్రయ్య

**వేద న్యూస్, క్యాతనపల్లి :**



మున్సిపల్ సాధారణ ఎన్నికల నేపథ్యంలో క్యాతనపల్లి మున్సిపల్ చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్ ల పరోక్ష ఎన్నికలు నిర్వహించడం జరిగిందని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి. చంద్రయ్య అన్నారు. శనివారం క్యాతనపల్లి మున్సిపాలిటీ కార్యాలయంలో జరిగిన ఎన్నిక కార్యక్రమానికి బెల్లంపల్లి సబ్ కలెక్టర్, ఎన్నికల పరిశీలకులు మనోజ్, క్యాతనపల్లి మున్సిపల్ కమిషనర్ మారుతి ప్రసాద్ లతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ మున్సిపల్ పాలకవర్గం పరీక్ష ఎన్నికకు ఎన్నికల సంఘం ఆదేశాల ప్రకారం చర్యలు తీసుకోవడం జరిగిందని తెలిపారు. ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా ఉండేందుకు ప్రత్యక్ష ప్రసారం ఏర్పాట్లు చేయడం జరిగిందని, ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయని తెలిపారు. క్యాతనపల్లి మున్సిపల్ చైర్ పర్సన్ గా గొడిసెల సంధ్యారాణి, వైస్ చైర్ పర్సన్ గా మిట్టపెల్లి సరిత లను ఎన్నుకోవడం జరిగిందని తెలిపారు.

# బీఆర్ఎస్‌కు గుడ్‌బై.. కాంగ్రెస్‌లో చేరిక



**వేద న్యూస్, దేవరకద్ర:**

మూసాపేట్ మండలం తాళ్లగడ్డ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు శనివారం దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఎమ్మెల్యే వారికి కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. నారాయణ గౌడ్, యాదయ్య గౌడ్, రమేష్ గౌడ్ తదితర నాయకులు, మహిళలు, యువకులు పెద్ద సంఖ్యలో ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు తెలిపారు.

# కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ



**వేద న్యూస్, దేవరకద్ర:**

కొత్తకోట మండలానికి చెందిన కళ్యాణ లక్ష్మి, షాది ముబారక్, సీఎం రిలీఫ్ ఫండ్ లబ్ధిదారులకు దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి చెక్కులు పంపిణీ చేశారు. స్థానిక నాయకులు, అధికారులతో కలిసి ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. దేవరకద్ర నియోజకవర్గంలోని ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు.

# ఆరోగ్య ఉప కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే పోచారం



**వేద న్యూస్, కోటగిరి :**

కోటగిరి మండలం కొత్తపల్లి గ్రామంలో 20 లక్షల రూపాయలతో నూతనంగా నిర్మించిన ముదిరాజ్ సంఘం భవనం, 20 లక్షల రూపాయలతో నూతనంగా నిర్మించిన ఆరోగ్య ఉప కేంద్రం ( హెల్త్ సబ్ సెంటర్) ను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారులు, బాన్సువాడ నియోజకవర్గ శాసన సభ్యులు పోచారం శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర ఆగ్రోస్ ఛైర్మెన్ కాసుల బాలరాజు తో కలిసి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. ఆరోగ్య ఉప కేంద్రంలో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక మండల ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే

**వేద న్యూస్, పోతంగల్ :**



పోతంగల్ మండల కేంద్రంలోని విశాల సహకార పరపతి సంఘంలో రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ ఛైర్మన్ కాసుల బాలరాజ్తో కలిసి రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారులు, బాన్సువాడ నియోజకవర్గ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి శనివారం వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పోచారం మాట్లాడుతూ.. రైతులు తెచ్చిన ఎండిన ధాన్యాన్ని వెనువెంటనే కాంటాలు చేయాలన్నారు. ప్రభుత్వ మద్దతు ధర ఏ గ్రేడ్ రకం రూ.2,389 కామన్ గ్రేడ్ రకం రూ.2,369 ఉంటుందన్నారు. వర్షాలు పడే సూచనలు ఉన్నా కూడా రైతులు ధైర్యంగా భగవంతుడి మీద నమ్మకంతో ధాన్యాన్ని కోసి ఆరబెట్టారన్నారు. చుట్టుపక్కల వర్షాలు ఉన్నా మన దగ్గర పడలేదన్నారు. ముందు చూపుతో 45వేల బస్తాలు వచ్చాయన్నారు. ఎక్కడా కూడా గోనెసంచులు, లారీల కొరత లేకుండా చూడాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ ఛైర్మన్ గైక్వాడ్ హన్మంత్, సర్పంచ్, కల్లూరి సంధ్య హన్మాండ్లు, ఎంపీడీవో చందర్, ఆర్ఐ సయ్యద్ హుస్సేన్, మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు షాజీ పటేల్, పీఏసీ ఇన్ఛార్జి ఛైర్మన్ రియాజుద్దీన్, ఏవో నిషిత, సర్పంచులు, శ్రీనివాస్ రావు, జగన్, రామ్ రెడ్డి, భాస్కర్, రైతులు, గంధపు పవన్, గంగాధర్, ఎజాజ్ ఖాన్, రమేష్ సెట్,దిలీప్, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

# వీరనారి ఝల్కారిబాయి వర్ధంతి వేడుకలు

**వేద న్యూస్, మందమర్రి :**




మందమర్రి పట్టణంలోని మాజీ ఆర్మీ జవాన్ రాజేష్ పివ్ హాల్, రాణి పివ్ హాల్ నివాసంలో శనివారం వీరనారి ఝల్కారిబాయి చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించి వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఆర్మీ జవాన్ మాట్లాడుతూ ఝాన్సీ సమీపంలోని భోజ్‌లా గ్రామంలో సదోవర్ సింగ్, జమునాదేవి దంపతులకు వ్యవసాయకూలీ కుటుంబంలో 1830 నవంబర్ 22న జన్మించిన ఝల్కారిబాయి. చిన్న వయసులోనే తల్లి మరణించడంతో తండ్రి పెంపకంలో గుర్రపుస్వారీ, కత్తిసాము వంటి యుద్ధ విద్యలు నేర్చుకుందని అన్నారు. అడవిలో పశువులను మేపుతున్న ఝల్కారిపై దాడి చేసిన చిరుత పులిని కేవలం చేతికర్రతో చాకచక్యంగా హతమార్చిందన్నారు. ఝాన్సీలక్ష్మీబాయి సైన్యంలో ఆయుధ విభాగంలో పనిచేస్తున్న పూరణ్‌సింగ్‌ను వివాహం చేసుకున్న ఝల్కారిబాయి, తదనంతర కాలంలో లక్ష్మీబాయికి సన్నిహితమై సైన్యంలో చేరి 'దుర్గావాహిని' మహిళా సాయుధ దళానికి నాయకత్వం వహించిందని తెలిపారు.సిపాయి తిరుగుబాటు సందర్భంగా శత్రుసేనలతో జరిగిన యుద్ధంలో ప్రముఖ పాత్రను పోషించి చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయింది. 1858 ఏప్రిల్ 3న బ్రిటిష్ జనరల్ హగ్ రోజ్ నాయకత్వంలో బ్రిటిష్ సేనలు ఝాన్సీ రాజ్యాన్ని చుట్టుముట్టాయి. ఆ దాడి నుంచి లక్ష్మీబాయి సురక్షితంగా తప్పించుకుని కల్పి ప్రాంతంలో పోరాడుతున్న తిరుగు బాటు నాయకులను కలుసుకోవడానికి అనువుగా, ఝల్కారీబాయి తానే ఝాన్సీలక్ష్మీబాయినంటూ కోట ముందు ప్రత్యక్షమై బ్రిటిష్ సేనలను ముప్పుతిప్పలు పెట్టింది. ఆ దాడిలో ఝాన్సీలక్ష్మీబాయి రూపంలో బందీగా పట్టుబడ్డ ఝల్కారిబాయిని గుర్తుపట్టిన బ్రిటిష్ సేనలు, ఆమెను చంపేసి ఉంటారని భావించారు. భారత ప్రభుత్వం, ఆమె జ్ఞాపకార్థం పోస్టల్ స్టాంపును విడుదల చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సింగరేణి పాఠశాల ఉపాధ్యాయులు ఓ. రవీందర్, టీ. దయాకర్ లు పాల్గొన్నారు.

# షాలోమ్ పాస్టర్ ఫెలోషిప్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 'రన్ ఫర్ జీసస్'

**వేద న్యూస్, మందమర్రి :**

మందమర్రి షాలోమ్ పాస్టర్ ఫెలోషిప్ అసోసియేషన్ ల ఆధ్వర్యంలో శనివారం రన్ ఫర్ జీసస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక దొర్ల బంగ్లా ఆవరణం నుండి ప్రారంభమై పట్టణంలో పలు విధులలో సాగుతూ పాత బస్టాండ్ వద్ద గల ఫ్లైఓవర్ బ్రిడ్జి నందు ముగించారు. ఈ సందర్భంగా పాస్టర్ ఫెలోషిప్ అధ్యక్షులు ఏలీయా మాట్లాడుతూ పట్టణంలోని క్రైస్తవులు,పాస్టర్ల ఆధ్వర్యంలో ఈ విజయోత్సవ కార్యక్రమం నిర్వహించామన్నారు. క్రీస్తు ప్రపంచమానవాళి కొరకు సిలువలో ప్రాణం విడిచి తిరిగి మృత్యుంజయుడై లేచాడని తెలియజేయుటకు,సమాజ ఐక్యతను తెలియ జెప్పుటకు రన్ ఫర్ జీసస్ కార్యక్రమము నిర్వహించడం జరిగిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాస్టర్ ఫెలోషిప్ దైవజనులు జాన్ ప్రసాద్, ఆనంద్, విజయ్,జూపక సాల్మోన్,జెర్మియా,ఉపేందర్ సాల్మోన్ లు పాల్గొన్నారు.



# డంపింగ్ యార్డ్ పై జేఏసీ ఏర్పాటు చేయండి



**వేద న్యూస్, హుజురాబాద్:**

- సమస్య పరిష్కారానికి మాత్రమే ప్రాధాన్యత ఇద్దాం
- కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్ ఛార్జీ ప్రణవ్

హుజూరాబాద్ పట్టణ పరిధిలోని సిర్సపల్లి శివారులో నిర్మించ తలపెట్టిన డంప్ యార్డ్ ప్రతిపాదన వెనక్కి తీసుకోవాలని ఈ విషయమై అన్ని వర్గాలు కలిసి జేఏసీగా ఏర్పాటు కావాలని హుజురాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి వొడితల ప్రణవ్ సూచించారు.శనివారం ఆయన వేస్ట్ టు ఎనర్జీ డంపింగ్ యార్డ్ ప్రతిపాదనను వ్యతిరేకిస్తూ నిరసన తెలుపుతున్న వేదిక వద్దకు వెళ్లి వారికి సంఘీభావం తెలిపారు.అనంతరం ఆయన మాట్లాడుతూ వేస్ట్ టు ఎనర్జీ యార్డుతో జనాలతో పాటు,వాటి వ్యర్థాల వల్ల పంట పొలాలకు కూడా ఇబ్బందులు తలెత్తుతాయని తెలిపారు.జనావాసాల మధ్య కాకుండా వేరేచోటుకి మార్పిడికి కట్టుబడి ఉన్నామని,కాంగ్రెస్ పార్టీ ఎప్పుడు ప్రజలకు వ్యతిరేకమైన పని చేయదని స్పష్టం చేశారు.కరీంనగర్ జిల్లాకు ప్రస్తుతం కలెక్టర్ కొత్తగా వచ్చారని,వారి దృష్టికి ఈ విషయం తీసుకెళ్లామని,అన్ని పార్టీలతోపాటు అన్ని వర్గాల వారిని కలుపుకుని జేఏసీగా ఏర్పాటు చేసుకుని,సమగ్ర నివేదిక తయారు చేసుకుని ముందుకెళ్లాలని స్పష్టం చేశారు.మంత్రులతో పాటు అవసరమైతే సీఎం దృష్టికి తీసుకెళ్లడానికి ఈ ప్రాంత బిడ్డగా కట్టుబడి ఉన్నామని,డంపింగ్ యార్డ్ విషయమై జిల్లా ఇంచార్జి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు,మంత్రులకు ఈ విషయం చెప్పామని వేరే చోటుకు మార్చడానికి కృషి చేస్తానని ప్రణవ్ మరోమారు స్పష్టం చేశారు.రాజకీయ పార్టీల వలలో చిక్కుకోవద్దని,సమస్య పరిష్కారమే ధ్యేయంగా అందరం కలిసి ముందుకు వెళ్దామని నాయకులందరికీ ప్రణవ్ స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో హుజురాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ సుహాసిని,కౌన్సిలర్లు,కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# సింగరేణి మండలానికి సీతారామ ప్రాజెక్టు నీళ్లు ఇవ్వాలి

- సిపిఎం డివిజన్ కార్యదర్శి భూక్య వీరభద్రం

**వేద న్యూస్,కారేపల్లి :**

స్వాతంత్రం వచ్చి 80 సంవత్సరాలు పూర్తవుతున్న ఏజెన్సీ మండలమైన సింగరేణి మండలానికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా అందలేదని వర్షం బోర్ల ఆధారంతోని గిరిజన, గిరిజనేత రైతులు పంటలు పండిస్తున్నారు. ఈ కారణంగా పంట పెట్టుబడి పెరిగి, సకాలంలో వర్షాలు పడని కారణంగా సాగునీటి సమస్యలు ఎదుర్కొంటున్నారని సీతారామ ప్రాజెక్టు నీళ్లను సింగరేణి కామేపల్లి మండలాలకు అందించాలని సిపిఎం వైరా డివిజన్ కార్యదర్శి భూక్య వీరభద్రం డిమాండ్ చేశారు. శనివారం పార్టీ చీమలపాడు ప్రాంత ఉద్యమ కీలక నేత, సిపిఎం సీనియర్ నాయకులు రాచర్ల జయరామయ్య 30వ వర్ధంతి సభ పార్టీ మండల కమిటీ సభ్యులు అజ్మీర్ శోభన్ బాబు అధ్యక్షతన జరగగా ఆయన మాట్లాడుతూ ఖమ్మం జిల్లాలో ముగ్గురు మంత్రులు అందులోనూ ఉప ముఖ్యమంత్రి మరియు ఆర్థిక శాఖ,రెవెన్యూ శాఖ, వ్యవసాయ శాఖ మంత్రులుగా కీలకమైన పదవులు అనుభవిస్తూ ఏజెన్సీ మండలాలకు నీరు అందించడంలో విఫలమయ్యారని తమ సొంత నియోజకవర్గాలకు నిధులు కేటాయించడం మరియు నీళ్లు తీసుకెళ్లడం వంటి పక్షపాత వైఖరిని అవలంబిస్తున్నారని విమర్శించారు. గిరిజన మండలాలు అందునా పేదరికం తో విలవిలాడుతూ అన్ని రకాలుగా వెనుకబడి ఉన్న ప్రజానీకానికి అభివృద్ధి చేయకపోవడం రాజ్యాంగ విద్య అని రాజ్యాంగంపై ప్రమాణం చేసి పదవులు వెలగబెడితే ఏమి లాభం లేదని పేర్కొన్నారు. ఈ మండలాలకు గిరిజన శాసనసభ్యులు ఉండి సాగునీరు అందించకపోవడం లొంగుబాటుకు, స్వార్థ ప్రయోజనాలకు తార్కానమని తెలిపారు. చీమలపాడు ప్రాంతంలో కాలువల నిర్మాణానికి భూములు తీసుకుంటూ 2013 నిర్వాసితుల చట్టాన్ని కూడా సంపూర్ణంగా అమలు చేయడం లేదని ఇది గిరిజనులకు అన్యాయమేనని ఆయన తెలిపారు. పత్తి మిర్చి పంటలు దెబ్బతిని ఎక్కువ మంది రైతులు మొక్కజొన్న పంట వేశారని పంట కొనుగోలుకు ఎక్కువ కేంద్రాలు ఏర్పాటు చేయాలని, అర్హులైన వారందరికీ ఇందిరమ్మలు ఇవ్వాలని లేని ఎడల ఉదృతమైన పోరాటాలు నిర్వహిస్తామని బుక్క వీరభద్రం హెచ్చరించారు. స్తూపం వద్ద జెండాను భూక్య వీరభద్రం ఎగురు వేశారు. ఈ వర్ధంతి సభలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కొండబోయిన నాగేశ్వరరావు, మండల కార్యదర్శి కే నరేంద్ర, మండల కమిటీ సభ్యులు యనమనగండ్ల రవిబాబు, వల్లబోయిన కొండలరావు, సీనియర్ నాయకులు ఎర్రిపోతు భద్రయ్య,మన్నెం బ్రహ్మయ్య, రాచబంటి పుల్లయ్య, పోతురాజు చందర్రావు,శాఖ కార్యదర్శిలు సురభాక సర్వయ్య, బానోత్ కిషన్, భానోత్ మంగీలాల్, రాచర్ల రణధీర్, షేరు వెంకటేశ్వర్లు, లలితమ్మ, మచ్చర్ల రమేష్, గోకినపల్లి భారత లక్ష్మీ, రాచర్ల నాగమణి, రాచర్ల జాలమ్మ, రాచర్ల రాంబాబు, సురభి ఉపేందర్, మాలోత్ హనుమ, భూక్య శ్రీను తదితరులు పాల్గొన్నారు.



# పాఠశాలలో విద్యా ప్రమాణాల పెంపుపై ప్రత్యేక దృష్టి

**వేద న్యూస్ జనగామ :**



పాఠశాలలో విద్యా ప్రమాణాలను మరింత మెరుగుపరచడంపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు. లింగాల ఘనపురం మండలంలోని బండ్లగూడెం గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని ఆయన శనివారం ఆకస్మికంగా సందర్శించి తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో అందిస్తున్న మౌలిక వసతులు, బోధన విధానం, ఉపాధ్యాయుల హాజరు తదితర అంశాలను సమగ్రంగా పరిశీలించారు. మధ్యాహ్న భోజన పథకం అమలు పరిస్థితిని కూడా పరిశీలిస్తూ, మెనూ ప్రకారం భోజనం అందుతున్నదా లేదా అని సంబంధిత అధికారులను ప్రశ్నించారు. భోజనశాల పరిశుభ్రత, ఆహారం నాణ్యతపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు. గుడ్ల నాణ్యతను స్వయంగా పరీక్షించి, వంట సామాగ్రి, బియ్యం, ఇతర సరుకుల గడువు తేదీలను కచ్చితంగా తనిఖీ చేయాలని ఆదేశించారు. పాఠశాల పరిసరాలు, తాగునీరు, మరుగుదొడ్లు ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచాలని సూచించారు. ప్రతి తరగతి గదిని సందర్శించిన కలెక్టర్, విద్యార్థులకు స్వయంగా బోధన చేశారు. ముఖ్యంగా గణిత విషయాన్ని సులభంగా అర్థమయ్యే విధంగా ఉదాహరణలతో వివరించారు. ఉపాధ్యాయులు కూడా విద్యార్థుల సామర్థ్యాలను పెంపొందించేలా బోధన చేయాలని, ముఖ్యంగా గణితంలో ఎదురయ్యే సమస్యలను పరిష్కరించడంపై దృష్టి పెట్టాలని సూచించారు. విద్యార్థులతో ప్రత్యక్షంగా మాట్లాడి పాఠ్యాంశాలను చదివించడంతో పాటు ప్రశ్నలు అడిగి వారి అవగాహనను పరీక్షించారు. విద్యార్థులు చదువుపై ఆసక్తి పెంచుకునేలా ప్రోత్సహించారు. బోధనలో మరింత నాణ్యత సాధించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని తెలిపారు. పదవ తరగతి విద్యార్థులకు ప్రత్యేకంగా సూచనలు చేస్తూ, పరీక్షల ముందు పునశ్చరణకు ప్రాధాన్యం ఇవ్వాలని అన్నారు. ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవడం, సరిపడ నిద్రపోవడం అవసరమని సూచించారు. పట్టుదలతో చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓ అన్నపూర్ణ, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

# యాదవ చైతన్య వేదిక జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా అనిల్ యాదవ్



**వేద న్యూస్, శంకరపట్నం:**

యాదవ చైతన్య వేదిక కరీంనగర్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా రేస్ అనిల్ యాదవ్ నియమితులయ్యారు. శనివారం శంకరపట్నంలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు గొర్ల ఐలేష్ యాదవ్ ఆయనకు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా అనిల్ యాదవ్ మాట్లాడుతూ.. యాదవుల, బీసీల సామాజిక, రాజకీయ చైతన్యం కోసం నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. ముఖ్యంగా చట్టసభల్లో బీసీ రిజర్వేషన్ల సాధన కోసం ఉద్యమిస్తామని పేర్కొన్నారు. తనకు ఈ అవకాశం కల్పించిన రాష్ట్ర కమిటీకి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు గొర్రెల కొమురయ్య యాదవ్, జక్కుల శ్రీనివాస్ యాదవ్, బాసవేణి తిరుపతి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# 99 రోజుల ప్రణాళిక అమలు వేగం

**వేద న్యూస్,కారేపల్లి:**



ఉసిరికాయలపల్లి గ్రామంలో గ్రామసభ అనంతరం ప్రజలు వ్యక్తం చేసిన ఫిర్యాదులకు సర్పంచ్ గుగులోత్ వరలక్ష్మి రాజు వెంటనే స్పందిస్తూ పరిష్కార చర్యలు చేపట్టారు. గ్రామ ప్రజల సమస్యలపై అప్రమత్తంగా స్పందిస్తూ, తక్షణ చర్యలు తీసుకోవడం ద్వారా సర్పంచ్ నాయకత్వం గ్రామస్థుల ప్రశంసలను అందుకుంటోంది. ఈ కార్యక్రమంలో స్వచ్ఛ భారత్ గ్రామపంచాయతీ సెక్రటరీ నిరంజన్, వార్డు సభ్యులు సురేష్, అరుణ పాల్గొన్నారు. గ్రామసభలో ప్రజలు ప్రస్తావించిన ముఖ్యమైన డ్రైనేజీ సమస్యలను వెంటనే గుర్తించి ఆలస్యం చేయకుండా పనులు ప్రారంభించి పరిష్కరించారు. అదేవిధంగా గ్రామంలో స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించబడింది. గ్రామ పరిశుభ్రత కోసం చేపట్టిన ఈ కార్యక్రమంలో అధికారులు, గ్రామస్థులు చురుకుగా పాల్గొన్నారు. గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచే దిశగా చర్యలు తీసుకున్నారు. ఇందిరమ్మ ఇళ్లలో జరిగిన అవకతవకలపై కూడా సర్పంచ్ గుగులోత్ వరలక్ష్మి రాజు స్పందిస్తూ వాటిని పరిష్కారం వైపు నడిపిస్తానని, పూర్తి స్థాయిలో పరిష్కరిస్తానని విలేకరులతో మాట్లాడుతూ తెలిపారు. ఈ కార్యక్రమాలు అన్నీ 99 రోజుల ప్రణాళికను దృష్టిలో ఉంచుకుని అమలు చేస్తున్నామని, గ్రామాభివృద్ధి, పరిశుభ్రత, ప్రజా సమస్యల పరిష్కారంలో ఎలాంటి లోపం ఉండకుండా కృషి చేస్తున్నామని సర్పంచ్ పేర్కొన్నారు.

# ఇంటి వద్దనే ఎఫ్ఐఆర్ నమోదు సేవలు ప్రారంభం

- ఆన్‌సైట్ ఎఫ్ఐఆర్‌తో బాధితులకు తక్షణ న్యాయం
- డయల్ 100, 112 ద్వారా సేవలు అందుబాటులోకి
- మహిళలు, పిల్లల కేసులకు ప్రత్యేక ప్రాధాన్యం

**వేద న్యూస్ నాగర్‌కర్నూల్:**




బాధితులు పోలీస్ స్టేషన్‌కు వెళ్లాల్సిన అవసరం లేకుండా వారి ఇంటి వద్దనే ఎఫ్ఐఆర్ నమోదు చేసే ఆన్‌సైట్ ఎఫ్ఐఆర్ కార్యక్రమాన్ని జిల్లా వ్యాప్తంగా ప్రారంభించినట్లు జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జి పాటిల్ తెలిపారు. రాష్ట్ర డీజీపీ శివధర్ రెడ్డి ఆదేశాల మేరకు ఈ సేవలను అమల్లోకి తీసుకొచ్చినట్లు చెప్పారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రమాదం లేదా నేరం జరిగిన వెంటనే బాధితులు డయల్ 100 లేదా 112కు కాల్ చేస్తే, పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని అక్కడికక్కడే ఎఫ్ఐఆర్ నమోదు చేస్తారని తెలిపారు. బాధితులకు వేగంగా న్యాయం అందించడమే ఈ కార్యక్రమం ముఖ్య లక్ష్యమని పేర్కొన్నారు. ప్రత్యేకంగా పాక్సో కేసులు, ఈవ్ టీజింగ్, గృహ హింస, చైల్డ్ మ్యారేజ్, దొంగతనాలు, ప్రమాదాలు, మహిళలపై జరిగే నేరాలకు ప్రాధాన్యం ఇచ్చి వెంటనే స్పందిస్తామని తెలిపారు. మహిళా పోలీస్ అధికారులతో కలిసి బాధితుల వద్దకు వెళ్లి ఫిర్యాదులు స్వీకరించి తగిన చర్యలు తీసుకుంటామని వివరించారు. మూగ, చెవిటి, దివ్యాంగులకు ప్రత్యేకంగా సహాయం అందించేందుకు ప్రత్యేక అధికారులను తీసుకెళ్లి వారి ఫిర్యాదులను నమోదు చేసి న్యాయం చేసే విధంగా చర్యలు తీసుకుంటామని ఎస్పీ స్పష్టం చేశారు. అందరికీ అందుబాటులో ఉండేలా పోలీసింగ్ సేవలను మరింత సమర్థవంతంగా రూపొందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా బాధితులకు సులభంగా, వేగంగా న్యాయం అందేలా పోలీస్ వ్యవస్థను ప్రజల దగ్గరికి తీసుకువస్తున్నామని ఎస్పీ పేర్కొన్నారు. ప్రజలు ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

వేద న్యూస్

ఆదివారం ఏప్రిల్ 05, 2026

# పరగడుపున ఉసిరి-జీలకర్ర నీరు: అద్భుత ఆరోగ్య ప్రయోజనాలు

- రోగనిరోధక శక్తి పెంపు
- మెరుగైన జీర్ణక్రియ మరియు బరువు నియంత్రణ
- చర్మ సౌందర్యం మరియు మధుమేహ నియంత్రణ



**వేద న్యూస్ డెస్క్:**

ప్రస్తుత ఉరుకుల పరుగుల జీవితంలో ఆరోగ్యాన్ని కాపాడుకోవడం అందరికీ ఒక సవాలుగా మారింది. అయితే మన వంటగదిలో లభించే సహజ సిద్ధమైన పదార్థాలతోనే సంపూర్ణ ఆరోగ్యాన్ని సొంతం చేసుకోవచ్చని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు. ముఖ్యంగా ప్రతిరోజూ ఉదయాన్నే పరగడుపున ఉసిరి మరియు జీలకర్ర కలిపిన నీటిని సేవించడం వల్ల శరీరానికి ఊహించని రీతిలో మేలు జరుగుతుంది. ఉసిరిలో ఉండే విటమిన్ సి శరీరంలోని రోగనిరోధక శక్తిని పెంచడమే కాకుండా, ఇన్ఫెక్షన్ల బారి నుండి మనల్ని కాపాడుతుంది. జీలకర్ర జీర్ణక్రియను మెరుగుపరచడంలో కీలక పాత్ర పోషిస్తుంది. ఈ అద్భుత పానీయం తయారీ కోసం ఒక గ్లాసు నీటిలో ఒక చెంచా జీలకర్రను రాత్రంతా నానబెట్టాలి. ఉదయాన్నే ఆ నీటిని బాగా మరిగించి, అందులో కొంచెం తాజా ఉసిరి రసం లేదా ఉసిరి పొడిని కలుపుకోవాలి. ఈ మిశ్రమాన్ని గోరువెచ్చగా ఉన్నప్పుడు తాగడం వల్ల రక్తంలోని చక్కెర స్థాయిలు అదుపులో ఉంటాయి. అంతేకాకుండా, ఇది కాలేయ పనితీరును మెరుగుపరిచి శరీరంలోని విషతుల్యాలను బయటకు పంపిస్తుంది. తద్వారా రక్తం శుద్ధి జరిగి అంతర్గత అవయవాలు మెరుగ్గా పనిచేస్తాయి. జీర్ణ సంబంధిత సమస్యలతో బాధపడేవారికి ఈ డ్రింక్ ఒక వరం లాంటిదని చెప్పవచ్చు. జీలకర్రలోని ఎంజైములు గ్యాస్, ఎసిడిటీ మరియు మలబద్ధకం వంటి సమస్యలను దూరం చేస్తాయి. అదేవిధంగా, శరీరంలోని మెటబాలిజం రేటును పెంచి, అనవసరమైన కొవ్వును కరిగించడంలో ఇది తోడ్పడుతుంది. బరువు తగ్గాలనుకునే వారు తమ రోజువారీ దైనందిన జీవితంలో ఈ డిటాక్స్ డ్రింక్‌ను భాగం చేసుకోవడం వల్ల వేగంగా ఫలితాలను పొందవచ్చు. సహజ సిద్ధమైన మార్గంలో ఊబకాయం తగ్గించుకోవడానికి ఇది అత్యంత సులువైన మార్గం. కేవలం అంతర్గత ఆరోగ్యం మాత్రమే కాకుండా, బాహ్య సౌందర్యాన్ని పెంపొందించడంలో కూడా ఉసిరి-జీలకర్ర నీరు అద్భుతంగా పనిచేస్తుంది. ఉసిరిలోని యాంటీ ఆక్సిడెంట్లు చర్మాన్ని ముడతలు పడకుండా కాపాడి, సహజమైన మెరుపును అందిస్తాయి. జుట్టు కుదుళ్లను దృఢపరిచి, జుట్టు రాలడాన్ని అరికడతాయి. ప్రతిరోజూ ఈ నీటిని తీసుకోవడం వల్ల యవ్వనంగా కనిపించడమే కాకుండా, రోజంతా ఎంతో ఉత్సాహంగా, శక్తివంతంగా ఉండవచ్చని ఈ కథనం వివరిస్తోంది. మధుమేహం ఉన్నవారికి రక్తంలోని గ్లూకోజ్ స్థాయిలను స్థిరంగా ఉంచడంలో ఇది ఎంతగానో సహకరిస్తుంది. ఎటువంటి ఖర్చు లేకుండా ఇంటి వద్దనే లభించే ఈ పదార్థాలతో సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందవచ్చని నిపుణులు వెల్లడిస్తున్నారు. చిన్న మార్పులతో మన జీవనశైలిని మెరుగుపరుచుకోవడం ద్వారా దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యల నుండి దూరంగా ఉండవచ్చు. ఈ సహజ సిద్ధమైన డిటాక్స్ డ్రింక్‌ను క్రమం తప్పకుండా తీసుకోవడం ద్వారా అటు చర్మ సౌందర్యాన్ని, ఇటు దృఢమైన శరీరాన్ని సొంతం చేసుకోవడం సాధ్యమవుతుంది. కాబట్టి, నేటి నుండే ఈ ఆరోగ్యకరమైన అలవాటును ప్రారంభించి మీ జీవన ప్రమాణాలను మెరుగుపరుచుకోండి.

# మజ్జిగ తాగుతున్నారా?



- ఈ ఆరోగ్య సమస్యలు ఉన్నవారు జాగ్రత్త!
- కిడ్నీ మరియు కీళ్ల నొప్పుల సమస్యలు
- శ్వాసకోశ ఇబ్బందులు మరియు జలుబు
- లాక్టోస్ అసహనం మరియు నిపుణుల సూచనలు

**వేద న్యూస్ డెస్క్:**

సాధారణంగా మజ్జిగను అమృతంతో సమానంగా భావిస్తారు, కానీ కొన్ని ప్రత్యేక ఆరోగ్య పరిస్థితుల్లో ఇది ప్రతికూల ఫలితాలను ఇచ్చే అవకాశం ఉంది. ముఖ్యంగా మూత్రపిండాల సంబంధిత సమస్యలతో బాధపడేవారు మజ్జిగకు దూరంగా ఉండటమే మంచిదని ఆరోగ్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. మజ్జిగలో పొటాషియం మరియు ఫాస్ఫరస్ ఖనిజాలు అధికంగా ఉంటాయి. కిడ్నీలు బలహీనంగా ఉన్నప్పుడు ఈ ఖనిజాలను వడపోయడం శరీరానికి కష్టమవుతుంది, దీనివల్ల రక్తంలో వీటి స్థాయి పెరిగి కిడ్నీలపై అదనపు భారం పడుతుంది. ఇది ప్రాణాపాయ స్థితికి కూడా దారితీసే ప్రమాదం ఉంది. మజ్జిగకు సహజంగానే శరీరాన్ని చల్లబరిచే గుణం ఉంటుంది, ఇది ఎండాకాలంలో మేలు చేసినప్పటికీ జలుబు, దగ్గు ఉన్నవారికి ఇబ్బందికరంగా మారుతుంది. గొంతు నొప్పి లేదా శ్వాసకోశ సమస్యలు ఉన్నప్పుడు మజ్జిగ తాగడం వల్ల శరీరంలో శ్లేష్మం పెరిగే అవకాశం ఉంది. ముఖ్యంగా రాత్రి వేళల్లో మజ్జిగ తీసుకోవడం వల్ల ఈ సమస్యలు మరింత తీవ్రమవుతాయి. గొంతు ఇన్ఫెక్షన్ ఉన్న సమయంలో దీనిని సేవించడం వల్ల నొప్పి పెరగడమే కాకుండా కోలుకోవడానికి ఎక్కువ సమయం పడుతుంది. కాబట్టి ఇలాంటి సమయంలో నియంత్రణ అవసరం. పాల పదార్థాలు పడని వారు, అంటే లాక్టోస్ అసహనం ఉన్నవారు కూడా మజ్జిగ విషయంలో అప్రమత్తంగా ఉండాలి. పాలను పెరుగుగా మార్చి మజ్జిగ తయారు చేసినప్పటికీ, ఇందులో లాక్టోస్ నిల్వలు ఉంటాయి. ఇలాంటి వారు మజ్జిగ తాగినప్పుడు కడుపు ఉబ్బరం, గ్యాస్ మరియు విరేచనాలు వంటి జీర్ణ సంబంధిత సమస్యలు తలెత్తుతాయి. అలాగే ఆయుర్వేదం ప్రకారం, కీళ్ల నొప్పులు లేదా వాత సంబంధిత సమస్యలు ఉన్నవారు పుల్లటి మజ్జిగను అస్సలు తీసుకోకూడదు. పుల్లని మజ్జిగ కీళ్లలో వాపును మరియు నొప్పిని పెంచే అవకాశం ఉంది. ఒకవేళ మజ్జిగ తాగాలనుకుంటే ఎప్పుడూ తాజా పెరుగుతో చేసిన మజ్జిగను మాత్రమే తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. మజ్జిగలో జీలకర్ర పొడి, కొత్తిమీర, అల్లం వంటివి కలుపుకోవడం వల్ల జీర్ణక్రియ మెరుగుపడుతుంది. మధ్యాహ్నం భోజనంతో పాటు మజ్జిగ తీసుకోవడం ఆరోగ్యానికి అత్యంత ఉత్తమమైన పద్ధతి. రాత్రిపూట మజ్జిగ తాగడం వల్ల జలుబు చేసే ప్రమాదం ఉన్నందున, ఆ సమయంలో దీనిని నివారించడం మంచిది. ఆరోగ్య స్థితిని బట్టి సరైన సమయంలో సరైన పద్ధతిలో తీసుకోవడం వల్ల మాత్రమే పూర్తి ప్రయోజనాలను పొందవచ్చు. మజ్జిగ ఆరోగ్యానికి ఎంతో మేలు చేసినప్పటికీ పైన పేర్కొన్న సమస్యలు ఉన్నవారు మాత్రం వైద్యుల సలహా తీసుకోవడం ఉత్తమం. ఏ ఆహార పదార్థమైనా మన శరీర తత్వానికి సరిపడుతుందో లేదో గమనించుకుని తీసుకోవాలి. ముఖ్యంగా దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడేవారు తమ ఆహారపు అలవాట్లలో చిన్న మార్పులు చేసుకునే ముందు నిపుణుల అభిప్రాయం తీసుకోవడం ద్వారా అనవసర ఆరోగ్య సమస్యల నుండి బయటపడవచ్చు. సహజ సిద్ధమైన పానీయాలను సరైన నియమాలతో తీసుకుంటేనే అవి ఔషధాల వలె పనిచేస్తాయి.

# రాత్రిపూట పాదాలు కడగడం నిద్రలేమికి పరిష్కారం

**వేద న్యూస్ డెస్క్:**



సాధారణంగా మనం ముఖ సౌందర్యానికి ఇచ్చే ప్రాధాన్యత పాదాలకు ఇవ్వం. కానీ రోజంతా మన శరీర బరువును మోస్తూ మనల్ని నడిపించే పాదాల సంరక్షణ కేవలం అందానికి మాత్రమే కాదు, ఆరోగ్యానికి కూడా ఎంతో అవసరమని నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా రాత్రి పడుకునే ముందు పాదాలను శుభ్రం చేసుకోవడం వల్ల అద్భుతమైన ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయని ఆయుర్వేదంతో పాటు ఆధునిక వైద్య శాస్త్రం కూడా ధృవీకరిస్తోంది. గోరువెచ్చని నీటితో పాదాలను కడుక్కోవడం వల్ల పాదాలలోని రక్తనాళాలు విశ్రాంతి పొంది, శరీర ఉష్ణోగ్రత సమతుల్యం అవుతుంది. ఇది మెదడుకు ప్రశాంతతను చేకూర్చి, నిద్రలేమి సమస్యను దూరం చేస్తుంది. మన పాదాలలో వందలాది నరాల కొనలు ఉంటాయి. రోజంతా పని ఒత్తిడితో అలసిపోయినప్పుడు, పాదాలను కడగడం వల్ల ఆ నరాలన్నీ ఉత్తేజితమై కండరాలు తక్షణమే విశ్రాంతి పొందుతాయి. ఇది శరీరంలో ఒత్తిడి కలిగించే హార్మోన్లను తగ్గించి మానసిక ప్రశాంతతను ఇస్తుంది. ఒక రకంగా చెప్పాలంటే, ఇది ఇంట్లోనే చేసుకునే చిన్నపాటి 'హోమ్ థెరపీ'లా పనిచేస్తుంది. చాలా మందికి రాత్రి వేళల్లో పాదాల మంటలు వేధిస్తుంటాయి; అలాంటి వారు చల్లటి నీటితో పాదాలను శుభ్రం చేసుకోవడం వల్ల శరీరంలోని అధిక వేడి తగ్గి హాయిగా అనిపిస్తుంది. ఇది కండరాల నొప్పుల నుండి కూడా తక్షణ ఉపశమనం కలిగిస్తుంది. ఆరోగ్యంతో పాటు పాదాల శుభ్రత కూడా ఎంతో ముఖ్యం. రోజంతా బూట్లు, చెప్పులు వేసుకోవడం వల్ల పాదాలపై బ్యాక్టీరియా మరియు చెమట పేరుకుపోతాయి. దీనివల్ల పాదాల నుండి దుర్వాసన రావడమే కాకుండా చర్మ ఇన్ఫెక్షన్లు వచ్చే అవకాశం ఉంటుంది. రాత్రి పూట పాదాలు కడగడం వల్ల చర్మానికి గాలి ఆడుతుంది, తద్వారా మడమల పగుళ్లు నివారించబడి పాదాలు మృదువుగా మారుతాయి. రక్త ప్రసరణ మెరుగుపడటం వల్ల ఉదయం నిద్రలేవగానే కాళ్లు చాలా తేలికగా అనిపిస్తాయి. ఇది చర్మ సౌందర్యాన్ని పెంపొందించడంలో కూడా కీలక పాత్ర పోషిస్తుంది.పాదాలను కడుక్కున్న తర్వాత కొన్ని జాగ్రత్తలు పాటించడం వల్ల మరింత మెరుగైన ఫలితాలు పొందవచ్చు. పాదాలు కడిగిన వెంటనే పొడి గుడ్డతో పూర్తిగా తుడుచుకోవాలి; తేమ ఉంటే వేళ్ల మధ్య ఇన్ఫెక్షన్లు వచ్చే ప్రమాదం ఉంది. వీలైతే పడుకునే ముందు కొద్దిగా కొబ్బరి నూనె లేదా మాయిశ్చరైజర్‌తో పాదాలకు మసాజ్ చేయడం వల్ల రక్త ప్రసరణ మరింత మెరుగుపడుతుంది. హాయిగా ఉండాలనుకునే వారు గోరువెచ్చని నీటిని, శరీర వేడి తగ్గించుకోవాలనుకునే వారు చల్లటి నీటిని ఉపయోగించడం ఉత్తమం. ఈ చిన్న మార్పు మీ జీవనశైలిలో పెద్ద మార్పును తీసుకువస్తుంది. రాత్రిపూట పాదాలను కడుక్కోవడం అనేది కేవలం ఒక అలవాటు మాత్రమే కాదు, అది సంపూర్ణ ఆరోగ్యానికి ఒక రహదారి. ప్రతిరోజూ పడుకునే ముందు ఐదు నిమిషాల సమయాన్ని పాదాల కోసం కేటాయించడం వల్ల పీడకలలు రాకుండా గాఢమైన నిద్ర పడుతుంది. ఒత్తిడితో కూడిన నేటి జీవనశైలిలో ప్రశాంతమైన మనసు కోసం ఇదొక సులభమైన మార్గం. సహజ సిద్ధంగా లభించే ఈ చిన్న చిట్కాలను పాటించడం ద్వారా అటు ఆరోగ్యాన్ని, ఇటు మానసిక ఉల్లాసాన్ని పొందవచ్చని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు. కాబట్టి, నేటి నుండే ఈ ఆరోగ్యకరమైన అలవాటును మీ దైనందిన జీవితంలో భాగం చేసుకోండి.

# మొలకలు తింటున్నారా?

**వేద న్యూస్ డెస్క్:**



ఆరోగ్యకరమైన జీవనశైలిని కోరుకునే వారు తమ ఆహారంలో మొలకలను (స్ప్రౌట్స్) తప్పనిసరిగా చేర్చుకుంటారు. సలాడ్లు, బ్రేక్‌ఫాస్ట్ బౌల్స్‌లో వీటిని ముడిగా తీసుకోవడమే అత్యంత శ్రేయస్కరమని చాలా మంది భావిస్తుంటారు. అయితే, మొలకలను పచ్చిగా తినడం వల్ల ఆరోగ్య ప్రయోజనాల కంటే కొన్ని సందర్భాల్లో ముప్పులే ఎక్కువగా ఉన్నాయని పోషకాహార నిపుణులు హెచ్చరిస్తున్నారు. మొలకలు పెరగడానికి అవసరమైన వేడి, తేమతో కూడిన వాతావరణం హానికరమైన ఈ.కోలి, సాల్మొనెల్లా వంటి బ్యాక్టీరియా వృద్ధికి కూడా అనుకూలంగా ఉంటుంది. కేవలం నీటితో కడగడం వల్ల ఈ బ్యాక్టీరియా పూర్తిగా తొలగిపోదు, కాబట్టి వీటిని ఆవిరి పట్టించడం లేదా తేలికగా వేయించి తీసుకోవడం సురక్షితం. చాలా మంది మొలకలను ప్రోటీన్‌కు ప్రధాన వనరుగా భావిస్తారు, కానీ వాస్తవం దీనికి భిన్నంగా ఉంది. 100 గ్రాముల మొలకలలో కేవలం 3 నుండి 4 గ్రాముల ప్రోటీన్ మాత్రమే ఉంటుంది, ఇది శరీర అవసరాలకు సరిపోదు. ఇతర ప్రోటీన్ వనరులతో పోలిస్తే ఇది చాలా తక్కువ పరిమాణం. అందుకే మొలకలను ప్రధాన ఆహారంగా కాకుండా, ఒక ఉపాహారంగా ) మాత్రమే పరిగణించాలని నిపుణులు సూచిస్తున్నారు. శరీరానికి కావాల్సిన సరైన ప్రోటీన్ కోసం పప్పులు, పనీర్, గుడ్లు, టోఫు మరియు శనగలు వంటి ఇతర బలవర్ధకమైన ఆహారాలను తీసుకోవడం ఎంతో అవసరం. కేవలం మొలకలపైనే ఆధారపడటం వల్ల ప్రోటీన్ లోపం ఏర్పడే అవకాశం ఉంది. ముడి మొలకలు జీర్ణక్రియపై కూడా ప్రతికూల ప్రభావాన్ని చూపవచ్చు. వీటిలో ఫైబర్ మరియు ఫెర్మెంటబుల్ కార్బోహైడ్రేట్లు అధికంగా ఉండటం వల్ల, సున్నితమైన జీర్ణ వ్యవస్థ ఉన్నవారికి ఇబ్బందులు తప్పవు. ముఖ్యంగా ఐబీఎస్ వంటి సమస్యలతో బాధపడేవారికి పచ్చి మొలకలు తింటే కడుపు ఉబ్బరం, గ్యాస్ మరియు కడుపు నొప్పి వంటి సమస్యలు తలెత్తుతాయి. మొలకలను కొద్దిగా వండటం వల్ల వాటిలోని క్లిష్టమైన కార్బోహైడ్రేట్లు విచ్ఛిన్నమై, సులభంగా జీర్ణమవుతాయి. తద్వారా శరీరానికి ఎటువంటి అసౌకర్యం కలగకుండా పోషకాలు అందుతాయి.మొలకలను నిల్వ చేసే విషయంలో కూడా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. వీటిని ఫ్రిజ్‌లో ఉంచినప్పటికీ బ్యాక్టీరియా పెరుగుదల పూర్తిగా ఆగదు, కేవలం నెమ్మదిస్తుంది. అందుకే మొలకలను తయారు చేసిన 24 నుండి 48 గంటల లోపు ఉపయోగించడం అత్యుత్తమం. అంతకంటే ఎక్కువ రోజులు నిల్వ ఉంచితే అవి చెడిపోయి విషతుల్యంగా మారే ప్రమాదం ఉంది. మొలకలు ఆరోగ్యానికి మంచివే అయినప్పటికీ, వాటిని ఎలా తింటామన్నదే ముఖ్యం. సురక్షితమైన పద్ధతిలో వాటిని వండుకుని తినడం ద్వారా ఇన్ఫెక్షన్ల బారి నుండి తప్పించుకోవడమే కాకుండా సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందవచ్చు.

# పిల్లల్లో పోషకాహార లోపం

**వేద న్యూస్ డెస్క్:**




పిల్లలు ఆరోగ్యంగా ఎదుగుతూ, ఎత్తుకు తగ్గ బరువు ఉండాలంటే వారికి సమతుల్యమైన పోషకాహారం అందించడం ఎంతో అవసరం. ఎదిగే వయసులో పిల్లలు తరచూ అనారోగ్యం బారిన పడకుండా ఉండాలంటే తల్లిదండ్రులు వారి ఆహారపు అలవాట్లపై ప్రత్యేక దృష్టి సారించాలి. పిల్లల్లో కనిపించే కొన్ని శారీరక, మానసిక మార్పుల ద్వారా వారిలో పోషకాహార లోపం ఉందో లేదో గుర్తించవచ్చని నిపుణులు చెబు తున్నారు. ముఖ్యంగా ప్రొటీన్ల లోపం వల్ల మెదడు పనితీరు ప్రభావితమై, పిల్లల్లో ఆందోళన మరియు కుంగుబాటు వంటి సమస్యలు తలెత్తే అవకాశం ఉంది. కాబట్టి వారి ఆహారంలో ప్రొటీన్లు తగినంతగా ఉండేలా చూసుకోవాలి. సాధారణంగా పిల్లలు ఎంతో హుషారుగా ఉంటారు, కానీ కొందరు ఆహారం తీసుకోవడానికి అంతగా ఆసక్తి చూపరు. ఇలాంటి వారిలో జీర్ణక్రియ సమస్యలు ఉండవచ్చని, శరీరం పోషకాలను సరిగ్గా గ్రహించ లేకపోవడమే దీనికి ప్రధాన కారణమని నిపుణులు వివరిస్తున్నారు. జంక్ ఫుడ్స్, ఫాస్ట్ ఫుడ్ మరియు కృత్రిమ రంగులు ఉన్న ఆహార పదార్థాల వల్ల ఈ సమస్యలు వస్తాయి. వీటిని నివారించడానికి పిల్లలకు పెరుగు, మజ్జిగ మరియు బొప్పాయి వంటి సహజ సిద్ధమైన ఆహారాలను అందించడం ఉత్తమం. దీనివల్ల జీర్ణవ్యవస్థ మెరుగుపడటమే కాకుండా, శరీరానికి అవసరమైన పోషకాలు అందుతాయి. రోగనిరోధక శక్తి తక్కువగా ఉన్న పిల్లలు తరచూ ఫ్లూ మరియు ఇతర సీజనల్ వ్యాధుల బారిన పడుతుంటారు. పోషకాహార లోపం వల్ల అనారోగ్యం నుండి కోలుకోవడానికి కూడా వీరికి ఎక్కువ సమయం పడుతుందని పలు అధ్యయనాలు పేర్కొంటున్నాయి. బయటి ఆహారానికి దూరంగా ఉంచి, ఇంట్లో వండిన పోషక విలువలు గల ఆహారాన్ని అందించడం ద్వారా పిల్లల్లో వ్యాధి నిరోధక శక్తిని పెంచవచ్చు. అలాగే, ఆహారంలో సరైన పోషకాలు లభించనప్పుడు పిల్లలు ఏదో ఒకటి తినాలనే తపనతో అతిగా ఆహారం తీసుకుంటారు. దీనివల్ల చిన్న వయసులోనే ఊబకాయం వంటి సమస్యలు తలెత్తే ప్రమాదం ఉంది. పిల్లల ఎముకల పుష్టికి విటమిన్ డి మరియు క్యాల్షియం అత్యంత కీలకమైనవి. ఇవి సరిపడా అందకపోతే కండరాల నొప్పులు రావడం, ఎముకలు బలహీనపడటం మరియు చిన్న పనికే నీరసించిపోవడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. విటమిన్ డి కేవలం ఆహారం ద్వారానే కాకుండా, సూర్యరశ్మి ద్వారా కూడా పుష్కలంగా లభిస్తుంది. ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 3 గంటల మధ్య కనీసం 15 నుండి 30 నిమిషాల పాటు ఎండలో ఉండటం వల్ల శరీరానికి అవసరమైన విటమిన్ డి అందుతుంది. ఇది ఎదిగే పిల్లలకు ఎంతో అవసరమని జాతీయ వైద్య సంస్థలు సూచిస్తున్నాయి. పిల్లల ఎదుగుదలలో పోషకాహారం పోషించే పాత్ర అపారం. పైన పేర్కొన్న లక్షణాలను గమనించి, అవసరమైనప్పుడు వైద్యులను సంప్రదించి తగిన జాగ్రత్తలు తీసుకోవడం తల్లిదండ్రుల బాధ్యత. ఇక్కడ అందించిన సమాచారం కేవలం అవగాహన కోసం మాత్రమేనని, ఆరోగ్యపరమైన నిర్ణయాలు తీసుకునే ముందు వ్యక్తిగత వైద్యుల సలహాలు పాటించడం శ్రేయస్కరమని నిపుణులు తెలియజేస్తున్నారు. సరైన పోషకాహారం మరియు ఆరోగ్యకరమైన జీవనశైలితోనే పిల్లల భవిష్యత్తును ఉజ్వలంగా మార్చవచ్చు. నేటి నుండే మీ పిల్లల ఆహారపట్టికలో అవసరమైన మార్పులు చేసుకోండి.

వేద న్యూస్

ఆదివారం ఏప్రిల్ 05, 2026

# సన్‌రైజర్స్‌కు ఎదురుదెబ్బ..

## మధ్యలోనే వెళ్లిపోయిన ప్యాట్ కమిన్స్!




**వేద న్యూస్ డెస్క్:**

ఐపీఎల్ 2026 సీజన్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టుకు పెద్ద ఎదురుదెబ్బ తగిలింది. జట్టు కీలక ఆటగాడు ప్యాట్ కమిన్స్ వెన్నునొప్పి సమస్య కారణంగా టోర్నీ మధ్యలోనే ఆస్ట్రేలియాకు వెళ్లిపోయాడు. వైద్య పరీక్షలు, స్కాన్ కోసం స్వదేశానికి పయనమైన కమిన్స్ రాబోయే కొన్ని మ్యాచ్‌లకు దూరం కానున్నాడు. కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్ వేదికగా కోల్‌కతా నైట్ రైడర్స్‌పై సన్‌రైజర్స్ విజయం సాధించిన వెంటనే కమిన్స్ ఆస్ట్రేలియాకు బయల్దేరాడు. ఈ స్కాన్ ముందుగానే ప్లాన్ చేసినదని, క్రికెట్ ఆస్ట్రేలియా పర్యవేక్షణలో జరుగుతుందని సమాచారం. స్కాన్ పూర్తయ్యాక ఏప్రిల్ 17న తిరిగి జట్టుతో చేరే అవకాశముంది. దీంతో కనీసం రెండు మ్యాచ్‌లకు అతడు దూరంగా ఉండనున్నాడు. గత యాషెస్ సిరీస్ తర్వాత కమిన్స్ ఎక్కువ మ్యాచ్‌లు ఆడలేదు. టీ20 ప్రపంచకప్‌కు కూడా దూరమయ్యాడు. ఈ నేపథ్యంలో అతని ఫిట్‌నెస్‌పై జట్టు యాజమాన్యం జాగ్రత్తగా వ్యవహరిస్తోంది. ఇదిలా ఉండగా, కమిన్స్ గైర్హాజరీలో ఇషాన్ కిషన్ జట్టును నడిపిస్తున్నాడు. అతని కెప్టెన్సీలో సన్‌రైజర్స్ రెండు మ్యాచ్‌లు ఆడగా, ఒకదాంట్లో ఓటమి, మరొకదాంట్లో ఘన విజయం సాధించింది. ప్రస్తుతం రెండు పాయింట్లతో జట్టు పట్టికలో ఆరో స్థానంలో కొనసాగుతోంది. సన్‌రైజర్స్ తమ తదుపరి మ్యాచ్‌ను లక్నో సూపర్ జెయింట్స్‌తో హైదరాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో ఆడనుంది. ఈ సీజన్‌లో హైదరాబాద్‌కు ఇది తొలి హోమ్ మ్యాచ్ కావడం విశేషం.

# భారత్ బంగ్లాదేశ్ సిరీస్‌కు సంకేతాలు

**వేద న్యూస్ డెస్క్:**




ఐపీఎల్ ఉత్సాహం మధ్య భారత్‌బంగ్లాదేశ్ క్రికెట్ సంబంధాలు మళ్లీ చిగురించే సూచనలు కనిపిస్తున్నాయి. గతంలో భద్రతా కారణాలతో వాయిదా పడిన సిరీస్‌ను ఈ ఏడాది చివర్లో నిర్వహించేందుకు ఇరు దేశాల క్రికెట్ బోర్డులు ప్రాథమికంగా చర్చలు ప్రారంభించాయి. ఈ ప్రతిపాదిత సిరీస్‌లో మూడు వన్డేలు, మూడు టీ20 మ్యాచ్‌లు నిర్వహించేలా ప్రణాళికలు రూపొందుతున్నాయి. ఆసియా కప్‌కు ముందే ఈ సిరీస్‌ను పూర్తి చేయాలనే ఉద్దేశంతో షెడ్యూల్‌పై చర్చలు కొనసాగుతున్నాయి. సీనియర్ ఆటగాళ్లు పాల్గొనే అవకాశంతో ఈ సిరీస్‌పై అభిమానుల్లో ఆసక్తి పెరుగుతోంది. సవరించిన షెడ్యూల్ ప్రకారం భారత జట్టు ఆగస్టు చివరిలో బంగ్లాదేశ్‌కు చేరుకుని సెప్టెంబర్ ప్రారంభంలో మ్యాచ్‌లు ఆడే అవకాశం ఉంది. సెప్టెంబర్ ఒకటో తేదీన తొలి వన్డే, మూడు, ఆరు తేదీల్లో తదుపరి మ్యాచ్‌లు జరిగేలా ప్రణాళికలు ఉన్నాయి. అనంతరం టీ20 సిరీస్ సెప్టెంబర్ తొమ్మిదో తేదీ నుంచి ప్రారంభమై పన్నెండు, పదమూడు తేదీల్లో ముగిసేలా షెడ్యూల్ రూపొందుతోంది. ఇక బంగ్లాదేశ్ క్రికెట్ వ్యవస్థలో కూడా కొన్ని మార్పులు చోటుచేసుకుంటున్నాయి. ఐపీఎల్ ప్రసారాలపై ఉన్న పరిమితులను సడలించే దిశగా ఆలోచనలు జరుగుతున్నాయి. అయితే ప్రసార హక్కుల విషయంలో గత సమస్యలు మళ్లీ అడ్డంకిగా మారే అవకాశముంది. మొత్తానికి, ఇరు దేశాల మధ్య సిరీస్ నిర్వహణకు అనుకూల వాతావరణం ఏర్పడుతున్నప్పటికీ, అధికారిక ప్రకటన కోసం అభిమానులు ఎదురుచూడాల్సి ఉంది. ఈ సిరీస్‌కు తుది గ్రీన్ సిగ్నల్ ఎప్పుడు వస్తుందన్నది ఆసక్తికరంగా మారింది.

# నా కంటే వైభవ్ బ్యాట్ స్పీడ్ ఎక్కువ.. టీమిండియాకు ఖాయం: యువీ




**వేద న్యూస్ డెస్క్:**

భారత క్రికెట్ మాజీ ఆల్‌రౌండర్ యువరాజ్ సింగ్ యువ సంచలనం వైభవ్ సూర్యవంశీపై ప్రశంసల వర్షం కురిపించాడు. కేవలం 15 ఏళ్ల వయసులోనే అద్భుతమైన బ్యాటింగ్‌తో అందరి దృష్టిని ఆకర్షిస్తున్న వైభవ్ భవిష్యత్తులో టీమిండియాకు తప్పకుండా ఆడతాడని విశ్వాసం వ్యక్తం చేశాడు. వైభవ్ బ్యాటింగ్ నైపుణ్యాలపై మాట్లాడిన యువరాజ్ సింగ్.. అతని బ్యాట్ స్పీడ్ తనకంటే మెరుగ్గా ఉందని చెప్పడం విశేషం. “ప్రస్తుతం టీ20 క్రికెట్‌లో వస్తున్న యువ ఆటగాళ్లలో వైభవ్ సూర్యవంశీ ప్రత్యేకంగా కనిపిస్తున్నాడు. అతని బ్యాట్ స్పీడ్ అద్భుతంగా ఉంది. నా కంటే కూడా వేగంగా బ్యాట్ స్వింగ్ చేస్తాడు. ఇలాంటి ఆటగాళ్లు చాలా అరుదుగా కనిపిస్తారు” అని యువీ వ్యాఖ్యానించాడు. మైదానం నలువైపులా షాట్లు ఆడగల సామర్థ్యం వైభవ్‌కు ఉందని యువరాజ్ ప్రశంసించాడు. చిన్న వయసులోనే అతనిలో ఉన్న టాలెంట్ అసాధారణమని, విజయాలు-వైఫల్యాల నుంచి నేర్చుకుంటూ ముందుకు వెళ్తే అతను మరింత గొప్ప బ్యాటర్‌గా ఎదుగుతాడని అభిప్రాయపడ్డాడు. 2025 ఐపీఎల్ వేలంలో కేవలం 13 ఏళ్ల వయసులోనే రూ.1.1 కోట్లకు రాజస్థాన్ రాయల్స్ జట్టు వైభవ్‌ను తీసుకోవడం అతనిని ఒక్కసారిగా లైమ్‌లైట్‌లోకి తెచ్చింది. ఐపీఎల్ అరంగేట్రంలోనే తొలి బంతిని సిక్సర్‌గా మలిచిన వైభవ్.. తన రెండో మ్యాచ్‌లో 35 బంతుల్లో సెంచరీ బాది రికార్డులు సృష్టించాడు. ఐపీఎల్ యువ ఆటగాళ్లకు పెద్ద వేదికగా మారిందని యువరాజ్ అభిప్రాయపడ్డాడు. “ఇప్పుడు ఈ కుర్రాళ్లు పెద్ద ప్రేక్షకుల ముందే ధైర్యంగా ఆడుతున్నారు. అదే ఆటతీరును అంతర్జాతీయ స్థాయిలోనూ కొనసాగిస్తున్నారు. ప్రస్తుతం టీ20 జట్టులో పోటీ ఎక్కువగా ఉన్నా.. త్వరలోనే వైభవ్‌కు భారత జట్టులో అవకాశం దక్కుతుంది” అని యువరాజ్ ధీమా వ్యక్తం చేశాడు. ప్రస్తుతం అండర్-19 జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్న వైభవ్ సూర్యవంశీ భవిష్యత్తులో సీనియర్ టీమిండియాలో కూడా కీలక పాత్ర పోషించనున్నాడని క్రికెట్ వర్గాలు భావిస్తున్నాయి.

# ఆసియా బాక్సింగ్‌లో భారత్ దూకుడు..


## సెమీస్‌కు నిఖత్ జరీన్!



**వేద న్యూస్ డెస్క్:**

మంగోలియాలోని ఉలాన్‌బాతర్ వేదికగా జరుగుతున్న ఆసియా బాక్సింగ్ ఛాంపియన్‌షిప్-2026లో భారత మహిళా బాక్సర్లు అద్భుత ప్రదర్శనతో మెరిసిపోతున్నారు. ముఖ్యంగా తెలంగాణకు చెందిన స్టార్ బాక్సర్ నిఖత్ జరీన్ మరోసారి తన ప్రతిభను నిరూపిస్తూ సెమీఫైనల్స్‌కు దూసుకెళ్లింది. ఆమె విజయంతో భారత్‌కు మరో పతకం ఖాయం కావడం విశేషం. మహిళల 51 కిలోల విభాగంలో క్వార్టర్ ఫైనల్ బౌట్‌లో ఫిలిప్పీన్స్‌కు చెందిన జియాన్ బగుహిన్‌తో తలపడిన నిఖత్.. మ్యాచ్ ఆరంభం నుంచే పూర్తి ఆధిపత్యం చాటింది. తన వేగం, కచ్చితమైన పంచ్‌లతో ప్రత్యర్థిని పూర్తిగా కట్టడి చేసింది. చివరికి రిఫరీ స్టాప్ కాంటెస్ట్ (ఆర్ఎస్‌సీ) ద్వారా విజేతగా నిలిచి సెమీస్‌కు అర్హత సాధించింది. నిఖత్ ప్రదర్శనలో కనిపించిన దూకుడు, ఆత్మవిశ్వాసం ఆమెను మరో మెడల్ వైపు తీసుకెళ్తుందని క్రీడా విశ్లేషకులు భావిస్తున్నారు. ఇప్పుడు సెమీఫైనల్లో నిఖత్‌కు గట్టి సవాల్ ఎదురుకానుంది. చైనాకు చెందిన ఒలింపిక్ స్వర్ణ పతక విజేత వుయుతో ఆమె తలపడనుంది. ఈ పోటీ ఆసియా ఛాంపియన్‌షిప్‌లో అత్యంత ఆసక్తికర మ్యాచ్‌లలో ఒకటిగా నిలిచే అవకాశం ఉంది. నిఖత్ తన ఫామ్‌ను కొనసాగిస్తే ఫైనల్ చేరే అవకాశాలు ఉన్నాయని అభిమానులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఇక భారత జట్టులో ఇతర మహిళా బాక్సర్లు కూడా విశేష ప్రదర్శన కనబరుస్తున్నారు. మహిళల 60 కిలోల విభాగంలో ప్రియా చైనాకు చెందిన చెంగ్యు యాంగ్‌ను 4-1 తేడాతో ఓడించి సెమీస్‌కు చేరుకుంది. అలాగే 54 కిలోల విభాగంలో ప్రీతి పవార్ మంగోలియాకు చెందిన మంగున్ సెత్సెగ్‌పై 5-0తో ఏకపక్ష విజయం సాధించి సెమీఫైనల్స్‌కు అర్హత సాధించింది. ఈ విజయాలతో భారత్‌కు కనీసం మూడు పతకాలు ఖాయం అయ్యాయి.భారత మహిళా బాక్సింగ్‌లో ఇటీవల కాలంలో వచ్చిన అభివృద్ధి ఈ ఫలితాల్లో స్పష్టంగా కనిపిస్తోంది. యువ ఆటగాళ్లు అంతర్జాతీయ వేదికలపై ధైర్యంగా పోటీ పడుతూ దేశానికి గౌరవం తీసుకొస్తున్నారు. కోచ్‌లు, సపోర్ట్ స్టాఫ్ అందిస్తున్న శిక్షణ, సదుపాయాలు కూడా ఈ విజయాల్లో కీలక పాత్ర పోషిస్తున్నాయి. మొత్తానికి, ఆసియా బాక్సింగ్ వేదికపై భారత మహిళా బాక్సర్లు మరోసారి తమ ఆధిపత్యాన్ని చాటుతున్నారు. నిఖత్ జరీన్ నేతృత్వంలో ఈసారి భారత్ మరిన్ని పతకాలు సాధించాలని అభిమానులు ఆశిస్తున్నారు. సెమీస్ పోరాటాల్లో కూడా ఇదే జోరు కొనసాగిస్తే, భారత్‌కు బంగారు పతకాలు రావడం ఖాయం అనే నమ్మకం వ్యక్తమవుతోంది.

# ఉప్పల్ స్టేడియం వద్ద ట్రాఫిక్ ఆంక్షలు!



**వేద న్యూస్ డెస్క్:**

హైదరాబాద్‌లోని ఉప్పల్ రాజీవ్ గాంధీ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం వేదికగా జరగనున్న టాటా ఐపీఎల్ 2026 మ్యాచ్‌ల కోసం రాచకొండ పోలీసులు కట్టుదిట్టమైన భద్రతతో పాటు ట్రాఫిక్ ఆంక్షలను ప్రకటించారు. ఏప్రిల్ 5 నుంచి మే 22 వరకు జరిగే మ్యాచ్‌ల సందర్భంగా అభిమానులు, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా విస్తృత ఏర్పాట్లు చేశారు. మ్యాచ్ జరిగే రోజుల్లో మధ్యాహ్నం 12 గంటల నుంచి రాత్రి 11:50 వరకు ఉప్పల్ పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్ పరిమితులు అమల్లో ఉంటాయి. వరంగల్ వైపు నుంచి వచ్చే లారీలు, భారీ వాహనాలను ఔటర్ రింగ్ రోడ్ మీదుగా మళ్లిస్తారు. ఘట్‌కేసర్ నుంచి వచ్చే వాహనాలను బోడుప్పల్ మార్గం ద్వారా, ఎల్బీ నగర్ నుంచి వచ్చే వాహనాలను నాగోల్ వైపు దారి మళ్లిస్తారు. సాధారణ ప్రయాణికులు ఉప్పల్ మెయిన్ రోడ్‌కు బదులుగా నాగోల్, తార్నాక, చెర్లపల్లి మార్గాలను ఉపయోగించుకోవాలని పోలీసులు సూచించారు. భారీగా ప్రేక్షకులు రానున్న నేపథ్యంలో సుమారు 39,000 మందిని అంచనా వేసి, పోలీస్ శాఖ గట్టి భద్రతా ఏర్పాట్లు చేపట్టింది. లా అండ్ ఆర్డర్, ట్రాఫిక్, షీ టీమ్స్, బాంబ్ స్క్వాడ్‌లతో కలిపి దాదాపు 2,000 మంది సిబ్బందిని మోహరించనున్నారు. స్టేడియం లోపల, బయట కలిపి 430 సీసీటీవీ కెమెరాలతో ప్రతి కదలికను పర్యవేక్షిస్తారు. అదేవిధంగా స్టేడియంలోకి ల్యాప్‌టాప్‌లు, కెమెరాలు, పెద్ద బ్యాగులు, వాటర్ బాటిళ్లు, బయటి ఆహారం, సిగరెట్లు, లైటర్లు, పదునైన వస్తువులను అనుమతించబోమని స్పష్టం చేశారు. మ్యాచ్‌లకు వచ్చే అభిమానులు వ్యక్తిగత వాహనాల బదులుగా మెట్రో, ఆర్టీసీ బస్సుల వంటి ప్రజా రవాణా సదుపాయాలను వినియోగించుకోవాలని పోలీసులు కోరారు.

# ఓవర్‌సీస్ ప్లేయర్ అంటూ

## కోహ్లీకి ట్రోల్స్.. క్లారిటీ ఇదే



**వేద న్యూస్ డెస్క్:**

సోషల్ మీడియాలో వస్తున్న పుకార్లపై భారత స్టార్ క్రికెటర్ విరాట్ కోహ్లీ స్పందించారు. తాను ఓవర్‌సీస్ ప్లేయర్ అన్న వ్యాఖ్యలను ఆయన ఖండిస్తూ స్పష్టత ఇచ్చారు. రాయల్ చాలెంజర్స్ బెంగళూరు జట్టులో విదేశీ ఆటగాళ్ల జాబితాలో తన పేరును కూడా చేర్చుతున్నారనే ట్రోల్స్‌పై కోహ్లీ నవ్వుతూ కౌంటర్ ఇచ్చారు. ఓ ఇంటర్వ్యూలో ఈ విషయంపై ప్రశ్నించగా, “నన్నెందుకు అడుగుతున్నారు, విదేశీ ఆటగాళ్లను అడగండిడ నేనేమైనా ఓవర్‌సీస్ ప్లేయర్‌నా?” అంటూ కోహ్లీ సరదాగా స్పందించారు. తాను భారత ఆటగాడినేనని స్పష్టం చేస్తూ, సోషల్ మీడియాలో వస్తున్న అపోహలకు చెక్ పెట్టారు. ఇటీవల లండన్‌లో కుటుంబంతో ఎక్కువ సమయం గడుపుతున్న నేపథ్యంలో కోహ్లీపై ఈ రూమర్లు ఎక్కువయ్యాయి. అయితే అవన్నీ కేవలం అపోహలేనని ఆయన వ్యాఖ్యలతో తేలిపోయింది.ఇక మైదానంలో కోహ్లీ ఫామ్ విషయానికి వస్తే, ఐపీఎల్ 2026లో తొలి మ్యాచ్‌లోనే అద్భుత ప్రదర్శన కనబరిచాడు. హైదరాబాద్ జట్టుతో జరిగిన మ్యాచ్‌లో 38 బంతుల్లో 69 పరుగులు చేసి తన ఫామ్‌ను చాటుకున్నాడు. ఈ ఇన్నింగ్స్‌లో ఐదు సిక్సర్లు, నాలుగు ఫోర్లు కొట్టి అభిమానులను అలరించాడు. కొంతకాలంగా విశ్రాంతి తీసుకున్నానని, పూర్తిస్థాయి ఫిట్‌నెస్‌తోనే మైదానంలోకి వస్తానని కోహ్లీ తెలిపారు. శారీరకంగానే కాకుండా మానసికంగా కూడా బలంగా ఉండటం ముఖ్యమని ఆయన పేర్కొన్నారు. మొత్తానికి, సోషల్ మీడియాలో వైరల్ అయిన పుకార్లకు కోహ్లీ సరదా సమాధానంతోనే తెరదించాడు.

వేద న్యూస్

ఆదివారం ఏప్రిల్ 05, 2026

# కిరణ్‌కు కొత్త మలుపు



**వేద న్యూస్ డెస్క్:**

టాలీవుడ్ యువ హీరో కిరణ్ అబ్బవరం తన కెరీర్‌లో కీలక నిర్ణయం తీసుకుని కొత్త ప్రయాణానికి శ్రీకారం చుట్టాడు. వరుస విజయాలతో నటుడిగా మంచి గుర్తింపు తెచ్చుకున్న ఈ హీరోడ ఇప్పుడు దర్శకుడిగా మారేందుకు సిద్ధమవడం ఇండస్ట్రీలో చర్చనీయాంశంగా మారింది. ఇటీవల వచ్చిన సినిమాలతో బాక్సాఫీస్ వద్ద తన స్థాయిని పెంచుకున్న కిరణ్ అబ్బవరండ భారీ పారితోషిక ఆఫర్లను పక్కనబెట్టి తనలోని దర్శకుడిని బయటకు తీసుకురావాలని నిర్ణయించుకున్నాడు. ఈ నేపథ్యంలో 'రియాలిటీ' అనే కథను సిద్ధం చేసుకుని, అదే సినిమాతో దర్శకుడిగా పరిచయం కానున్నాడు. ఆధునిక తరానికి దగ్గరగా ఉండే కథతో ఈ చిత్రం రూపొందుతున్నట్లు సమాచారం. ఈ సినిమా మే నెలలో షూటింగ్ ప్రారంభం కానుండగా, దీపావళి సందర్భంగా విడుదల చేయాలని ప్రణాళికలు రూపొందిస్తున్నారు. ఈ ప్రాజెక్ట్‌లో కిరణ్ అబ్బవరం ఒకేసారి నటుడు, దర్శకుడు, నిర్మాతగా మూడు బాధ్యతలు చేపట్టనుండటం ప్రత్యేకత. ఇప్పటికే షార్ట్ ఫిలిమ్స్ చేసిన అనుభవంతో పూర్తి స్థాయి చిత్రాన్ని తెరకెక్కించేందుకు సిద్ధమవుతున్నాడు. ఇక నటుడిగానే కాకుండా నిర్మాతగా కూడా కిరణ్ బిజీగా ఉన్నాడు. తన సొంత బ్యానర్‌పై రూపొందిస్తున్న 'తిమ్మరాజుపల్లె టీవీ' చిత్రం త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రానుంది. అదే సమయంలో డిజిటల్ వేదికలపై కూడా తన ప్రతిభను చాటుకునేందుకు వెబ్ సిరీస్‌లలో అడుగుపెడుతున్నాడు. మొత్తానికి, ఒకేసారి మూడు బాధ్యతలు చేపట్టడం ద్వారా కిరణ్ అబ్బవరం తన కెరీర్‌లో కొత్త అధ్యాయాన్ని ప్రారంభిస్తున్నాడు. ఈ సాహసోపేత నిర్ణయం ఆయనకు ఎంతవరకు విజయాన్ని తీసుకువస్తుందో అన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

# కోలీవుడ్‌లో దూసుకెళ్తున్న మమిత బైజు

**వేద న్యూస్ డెస్క్:**




దక్షిణ భారత సినీ పరిశ్రమలో కొత్త తరం హీరోయిన్లలో వేగంగా ఎదుగుతున్న పేరు మమిత బైజు. మలయాళ ఇండస్ట్రీలో ప్రారంభమైన ఆమె ప్రయాణం, ఇప్పుడు తమిళ్ చిత్రసీమలో బలమైన స్థానం సంపాదించే దిశగా దూసుకెళ్తోంది. 'ప్రేమలు' సినిమాతో తెలుగు ప్రేక్షకులకు దగ్గరైన ఈ యువ నటి.. ఇప్పుడు కోలీవుడ్‌పై పూర్తిగా ఫోకస్ పెట్టడం సినీ వర్గాల్లో ఆసక్తికర చర్చలకు దారితీస్తోంది. మలయాళంలో ఇప్పటికే పలు చిత్రాల్లో నటించి మంచి గుర్తింపు తెచ్చుకున్న మమిత, 'ప్రేమలు' సినిమా విజయంతో సౌత్ మొత్తానికి పరిచయమైంది. ఈ చిత్రం తెలుగులో కూడా మంచి స్పందన సాధించడంతో, టాలీవుడ్‌లోనూ ఆమెకు గుర్తింపు పెరిగింది. ముఖ్యంగా యూత్‌లో మమితకు మంచి ఫాలోయింగ్ ఏర్పడింది. అయితే ఆ క్రేజ్‌కు తగ్గట్టుగా తెలుగులో వరుస అవకాశాలు రాకపోవడం గమనార్హం. ఈ నేపథ్యంలో, మమిత తన కెరీర్‌ను తెలివిగా మలుచుకుంటూ తమిళ్ ఇండస్ట్రీపై దృష్టి కేంద్రీకరించినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం కోలీవుడ్‌లో వరుసగా అవకాశాలు దక్కించుకుంటూ, టాప్ హీరోల సరసన నటించే అవకాశాలను అందిపుచ్చుకుంటోంది. ఇప్పటికే యువ దర్శకుడు, నటుడు ప్రదీప్ రంగనాథ్ సరసన 'డ్యూడ్' సినిమాలో నటించి తన ప్రతిభను చాటుకుంది. అంతేకాకుండా, తమిళ్ స్టార్ హీరో ధనుష్‌తో కలిసి 'కారా' సినిమాలో నటించడం ఆమె కెరీర్‌లో కీలక మలుపుగా భావిస్తున్నారు. ఈ చిత్రం సమ్మర్‌లో విడుదలకు సిద్ధమవుతుండగా, ఇందులో మమిత పాత్రపై కూడా ఆసక్తి నెలకొంది. మరోవైపు స్టార్ హీరో సూర్యతో కలిసి 'విశ్వనాథన్ అండ్ సన్స్' అనే ద్విభాషా చిత్రంలో నటించడం ఆమెకు మరింత క్రేజ్ తెచ్చిపెడుతోంది. ఈ సినిమాను దర్శకుడు వెంకీ అట్లూరి తెరకెక్కించగా, ఇప్పటికే విడుదలైన టీజర్‌కు మంచి స్పందన లభించింది. కేవలం తమిళ్ చిత్రాలకే పరిమితం కాకుండా, మమిత భవిష్యత్తులో పాన్ ఇండియా స్థాయిలో కూడా ఎదగాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నట్లు తెలుస్తోంది. కోలీవుడ్‌లో ప్రముఖ నటుడు సూరి సినిమాల్లో కూడా అవకాశాలు రావడం, ఆమెకు ఉన్న డిమాండ్‌ను స్పష్టంగా చూపిస్తోంది. వరుసగా పెద్ద ప్రాజెక్టులు దక్కించుకుంటున్న ఈ బ్యూటీ, తక్కువ సమయంలోనే టాప్ హీరోయిన్‌గా ఎదిగే అవకాశాలు ఉన్నాయని సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. మమిత వయసు కేవలం 24 సంవత్సరాలు మాత్రమే. ఇంత చిన్న వయసులోనే ఈ స్థాయిలో అవకాశాలు దక్కించుకోవడం ఆమె ప్రతిభకు నిదర్శనం. నటనతో పాటు, తన అందం, సహజమైన ఎక్స్‌ప్రెషన్స్, సింపుల్ లుక్‌తో ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది. ముఖ్యంగా ఆమె స్క్రీన్ ప్రెజెన్స్ యూత్‌ను బాగా ఆకర్షిస్తోంది. ఇక టాలీవుడ్ విషయానికి వస్తే.. 'విశ్వనాథన్ అండ్ సన్స్' సినిమా విజయం సాధిస్తే, మమితకు తెలుగులో కూడా భారీ అవకాశాలు వచ్చే అవకాశం ఉంది. ఇప్పటికే ఈ సినిమాపై మంచి అంచనాలు నెలకొనడంతో, మమిత భవిష్యత్తు కూడా ఈ ప్రాజెక్ట్‌పై కొంతవరకు ఆధారపడినట్టే కనిపిస్తోంది. మొత్తానికి, మమిత బైజు తీసుకున్న ఈ వ్యూహాత్మక నిర్ణయం ఫలిస్తుందా..? కోలీవుడ్‌లో స్థిరపడిన తర్వాత టాలీవుడ్‌లో కూడా టాప్ హీరోయిన్‌గా ఎదుగుతుందా..?

# 'పెద్ది' రిలీజ్‌పై క్లారిటీ.. ఏప్రిల్ 30నే గ్రాండ్ ఎంట్రీ!

**వేద న్యూస్ డెస్క్:**

మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ నటిస్తున్న భారీ గ్రామీణ క్రీడా నేపథ్యంలో రూపొందుతున్న 'పెద్ది' సినిమాపై వస్తున్న వాయిదా వార్తలకు తెరపడింది. ఈ చిత్రం నిర్ణయించినట్లుగానే ఏప్రిల్ 30న థియేటర్లలోకి రానుందని స్పష్టత వచ్చింది. 'రంగస్థలం' తర్వాత పూర్తిస్థాయి గ్రామీణ నేపథ్యంలో చరణ్ నటిస్తున్న సినిమా కావడంతో ఈ చిత్రంపై భారీ అంచనాలు నెలకొన్నాయి. శ్రీరామనవమి సందర్భంగా విడుదలైన 'పహిల్వాన్' గ్లింప్స్ ప్రేక్షకులను విపరీతంగా ఆకట్టుకుంది. చరణ్ మాస్ లుక్, నటన అభిమానుల్లో ఉత్సాహాన్ని రెట్టింపు చేశాయి. ఈ సినిమాతో బాక్సాఫీస్ వద్ద కొత్త రికార్డులు సృష్టిస్తాడనే నమ్మకం అభిమానుల్లో కనిపిస్తోంది. ఇటీవల ఈ సినిమా విడుదల జూన్‌కు వాయిదా పడుతుందనే ప్రచారం జోరుగా సాగింది. షూటింగ్ ఇంకా పూర్తికాలేదని, ఒక పాట పెండింగ్‌లో ఉందని, పోస్ట్ ప్రొడక్షన్ పనులు సమయానికి పూర్తవుతాయా అనే సందేహాలు వ్యక్తమయ్యాయి. కొన్ని పోస్టర్లలో విడుదల తేదీ లేకపోవడం ఈ వార్తలకు బలం చేకూర్చింది. అయితే ఈ రూమర్లన్నింటికీ చెక్ పెడుతూ రామ్ చరణ్ స్వయంగా క్లారిటీ ఇచ్చాడు. సినిమా వాయిదా పడదని, ముందుగా ప్రకటించినట్లుగానే ఏప్రిల్ 30న విడుదల అవుతుందని స్పష్టం చేశాడు. దీంతో అభిమానుల్లో ఆనందం వెల్లివిరిసింది. ప్రస్తుతం చిత్రబృందం మిగిలిన షూటింగ్ పనులను వేగంగా పూర్తి చేస్తోంది. ముఖ్యంగా మిగిలిన పాటను తక్కువ సమయంలో పూర్తి చేసి, పోస్ట్ ప్రొడక్షన్ పనులను కూడా త్వరగా ముగించేందుకు కృషి జరుగుతోంది. విదేశీ మార్కెట్‌లో ఇప్పటికే ప్రచారం ప్రారంభమైందని సమాచారం. ఏప్రిల్ 8 నుంచి అడ్వాన్స్ బుకింగ్స్ ప్రారంభమయ్యే అవకాశం ఉంది. ఈ సినిమాలో బాలీవుడ్ నటి జాన్వీ కపూర్ 'అచ్చియ్యమ్మ' పాత్రలో నటిస్తుండగా, కన్నడ నటుడు శివరాజ్ కుమార్




'గౌర్నాయుడు'గా కనిపించనున్నారు. అలాగే దివ్యేందు శర్మ 'రాంబుజ్జి'గా, జగపతి బాబు 'అప్పలసూరి' పాత్రలో కీలకంగా నటిస్తున్నారు. బొమన్ ఇరానీ, సత్య తదితరులు కూడా ముఖ్య పాత్రల్లో కనిపించనున్నారు. ఈ చిత్రానికి సంగీతాన్ని ఆస్కార్ విజేత ఏ.ఆర్. రెహమాన్ అందిస్తున్నారు. వృద్ధి సినిమాస్, మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ బ్యానర్లపై ఈ సినిమా అత్యంత ప్రతిష్టాత్మకంగా రూపొందుతోంది. మొత్తానికి 'పెద్ది' సినిమా రిలీజ్‌పై ఉన్న సందేహాలు పూర్తిగా తొలగిపోయాయి. ఏప్రిల్ 30న గ్రాండ్‌గా ప్రేక్షకుల ముందుకు రానున్న ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద ఎలాంటి సంచలనాలు సృష్టిస్తుందో చూడాలని సినీ అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

# 'వీరభద్రుడు'గా సూర్య సినిమా





**వేద న్యూస్ డెస్క్:**

తమిళ స్టార్ హీరో సూర్య నటిస్తున్న తాజా గ్రామీణ యాక్షన్ చిత్రం 'కరుప్పు' ఇప్పుడు తెలుగు ప్రేక్షకుల ముందుకు లి'వీరభద్రుడు'లి అనే శక్తివంతమైన పేరుతో రాబోతోంది. గ్రామీణ నేపథ్యంలో పక్కా మాస్ అంశాలతో తెరకెక్కుతున్న ఈ చిత్రం విడుదలకు ముందే సినీ వర్గాల్లో మంచి చర్చనీయాంశంగా మారింది. కొత్త పేరుతో రావడం వల్ల తెలుగు ప్రేక్షకుల్లో ఆసక్తి మరింత పెరిగింది. ఇటీవలి కాలంలో ఇతర భాషా సినిమాలను అదే పేర్లతో విడుదల చేయడం పట్ల కొంత అసంతృప్తి వ్యక్తమవుతుండగా, ఈ సినిమాకు ప్రత్యేకంగా తెలుగు పేరు పెట్టడం మంచి నిర్ణయంగా భావిస్తున్నారు. 'వీరభద్రుడు' అనే పేరు ద్వారా కథలోని ఉత్సాహం, శక్తి, యాక్షన్ స్పష్టంగా ప్రతిఫలిస్తున్నాయని అభిమానులు అభిప్రాయపడుతున్నారు. ఈ చిత్రానికి దర్శకుడు ఆర్. జె. బాలాజీ. కథాపరమైన సినిమాలతో గుర్తింపు పొందిన ఆయన ఈసారి పూర్తి స్థాయి మాస్ ఎంటర్‌టైనర్‌ను అందించేందుకు ప్రయత్నిస్తున్నారు. హీరోయిన్గా త్రిష నటిస్తుండగా, వీరిద్దరి జంటపై ఇప్పటికే మంచి అంచనాలు ఉన్నాయి. ఇద్దరూ గతంలోనూ మంచి విజయాలను అందుకోవడంతో ఈ కాంబినేషన్‌పై ప్రేక్షకుల్లో ఆసక్తి పెరిగింది. సంగీతాన్ని సాయి అభ్యంకర్ అందిస్తున్నారు. గ్రామీణ నేపథ్యానికి తగ్గట్టు ఆయన అందించే నేపథ్య సంగీతం సినిమాకు ప్రధాన బలంగా నిలుస్తుందని భావిస్తున్నారు. భారీ వ్యయంతో రూపొందుతున్న ఈ చిత్రాన్ని ప్రముఖ నిర్మాణ సంస్థ నిర్మిస్తోంది. నిర్మాణ విలువలు కూడా ఈ సినిమాకు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయని సినీ వర్గాలు చెబుతున్నాయి. వేసవి కానుకగా మే 14న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. సూర్య ప్రత్యేక శైలి యాక్షన్, భావోద్వేగాలు, గ్రామీణ వాతావరణం కలిసిన ఈ సినిమా ప్రేక్షకులను ఆకట్టుకునే అవకాశం ఉందని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. మొత్తానికి, కొత్త పేరు, బలమైన కథ, స్టార్ నటీనటులు కలిసి 'వీరభద్రుడు'ను ఈ సీజన్‌లో ఒక పెద్ద విజయంగా నిలబెట్టే అవకాశాలు కనిపిస్తున్నాయి.

# నిధి అగర్వాల్ కెరీర్‌పై సందేహాలు

**వేద న్యూస్ డెస్క్:**



టాలీవుడ్‌లో లక్కీ బ్రేక్‌తో ఎంట్రీ ఇచ్చిన నటి నిధి అగర్వాల్ కెరీర్ ప్రస్తుతం సందిగ్ధ దశలో ఉందనే చర్చలు జోరుగా సాగుతున్నాయి. భారీ అవకాశాలతో ఎదుగుతుందని భావించిన ఆమె ప్రయాణం ఆశించిన దిశలో సాగకపోవడం సినీ వర్గాల్లో చర్చనీయాంశమైంది. సవ్యసాచి సినిమాతో తెలుగు ప్రేక్షకులకు పరిచయమైన నిధి, తర్వాత మిస్టర్ మజ్ను లో నటించినప్పటికీ పెద్దగా గుర్తింపు రాలేదు. అయితే ఇస్మార్ట్ శంకర్ సినిమాలో అవకాశం రావడం ఆమె కెరీర్‌కు కీలక మలుపు తీసుకొచ్చింది. ఆ సినిమా బ్లాక్‌బస్టర్ కావడంతో నిధిపై ఇండస్ట్రీ దృష్టి పడింది. అదే ఊపులో పవర్ స్టార్ పవన్ కళ్యాణ్‌తో హరి హర వీరమల్లు, అలాగే పాన్ ఇండియా స్టార్ ప్రభాస్‌తో రాజాసాబ్‌లివంటి భారీ ప్రాజెక్టుల్లో నటించే అవకాశాలు దక్కించుకుంది. ఈ సినిమాలు తన కెరీర్‌ను మరోస్థాయికి తీసుకెళ్తాయని ఆశించినా, ఫలితాలు మాత్రం ఆశించిన విధంగా రాలేదని సమాచారం. దీంతో సినిమా అవకాశాలు తగ్గాయా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో నిధి తన దృష్టిని బ్రాండ్ ప్రమోషన్స్ వైపు మళ్లించినట్లు కనిపిస్తోంది. ఇటీవల ఆమె పలు యాడ్స్, సోషల్ మీడియా ప్రమోషన్స్‌లో చురుకుగా కనిపిస్తోంది. ఫ్యాషన్, బ్యూటీ, లైఫ్‌స్టైల్ బ్రాండ్లకు అంబాసిడర్‌గా వ్యవహరిస్తూ తన ఇమేజ్‌ను కొనసాగిస్తోంది. సెలబ్రిటీలు సినిమాలతో పాటు బ్రాండ్ ఎండార్స్‌మెంట్స్ ద్వారా ఆదాయం పొందడం ఇప్పుడు సాధారణం అయినప్పటికీ, నిధి విషయంలో ఇది ఒక రూట్ మార్పుగా భావిస్తున్నారు. సోషల్ మీడియాలో మంచి ఫాలోయింగ్ ఉండటంతో కంపెనీలు కూడా ఆమెను ఎంపిక చేస్తున్నాయి. మొత్తానికి, ప్రస్తుతం సినిమాల కంటే ప్రమోషన్స్‌లో ఎక్కువగా కనిపిస్తున్న నిధి అగర్వాల్‌కు మళ్లీ మంచి సినిమా అవకాశాలు వస్తాయా? లేక ఇదే దిశలో కొనసాగుతుందా? అన్నది ఆసక్తికరంగా మారింది.

# క్యాస్టింగ్ కౌచ్ వివాదం మళ్లీ

**వేద న్యూస్ డెస్క్:**



టాలీవుడ్ చిత్ర పరిశ్రమలో క్యాస్టింగ్ కౌచ్ అంశం మరోసారి తీవ్ర చర్చకు దారితీసింది. సినిమా అవకాశాల పేరుతో వేధింపులు జరుగుతున్నాయంటూ ఓ విదేశాల్లో నివసిస్తున్న తెలుగు యువతి చేసిన ఆరోపణలు ఇప్పుడు సంచలనంగా మారాయి. సామాజిక మాధ్యమాల్లో ఆమె విడుదల చేసిన వీడియో విస్తృతంగా ప్రచారం కావడంతో ఈ విషయం సినీ వర్గాల్లో పెద్ద చర్చకు కారణమైంది. ఆ యువతి తన వీడియోలో మాట్లాడుతూడ సినిమా అవకాశాలు ఇస్తామని చెప్పి ఒక నిర్మాత తనను వేధించాడని ఆరోపించింది. తనను కలవడానికి ఒక విశ్రాంతి కేంద్రానికి రావాలని ఒత్తిడి చేశారని తెలిపింది. ఈ సందర్భంగా ఇండస్ట్రీలో ఉన్న చీకటి కోణాలను బయటపెడుతూ భావోద్వేగానికి లోనైంది. ఈ వీడియో బయటకు రావడంతో నెటిజెన్లలో తీవ్ర స్పందన వ్యక్తమవుతోంది. ఈ ఘటనపై నటి పూనమ్ కౌర్ ఘాటుగా స్పందించారు. మహిళల సమస్యలపై ఎప్పుడూ స్పందించే ఆమెడ ఈ ఘటనను తీవ్రంగా ఖండించారు. తెలుగు చిత్ర పరిశ్రమలో ఒకప్పుడు వెలుగొందిన సావిత్రి, జయప్రద, భానుప్రియ, శ్రీదేవి, సౌందర్య వంటి గొప్ప నటీమణులు ఇప్పుడు ఎందుకు కనిపించడం లేదో చెప్పడానికి ఇలాంటి పరిస్థితులే కారణమని వ్యాఖ్యానించారు. ప్రతిభ ఉన్న తెలుగు అమ్మాయిలకు సరైన అవకాశాలు రాకపోవడానికి ఇలాంటి వేధింపులే కారణమని పూనమ్ పేర్కొన్నారు. గతంలో కూడా పలువురు నటీమణులు ఈ సమస్యపై మాట్లాడిన సందర్భాలు ఉన్నాయని, ఇది కొత్త విషయం కాదని ఆమె గుర్తుచేశారు. ఇలాంటి పరిస్థితుల వల్లే చాలా మంది యువతులు ఇండస్ట్రీలోకి రావడానికి వెనుకడుగు వేస్తున్నారని లేదా మధ్యలోనే తమ కెరీర్‌ను వదులుకుంటున్నారని ఆమె అభిప్రాయపడ్డారు. ఈ ఘటనపై సామాజిక మాధ్యమాల్లో విభిన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కొందరు పూనమ్ వ్యాఖ్యలకు మద్దతు తెలుపుతూ పరిశ్రమలో పారదర్శకత అవసరమని చెబుతుండగాడ మరికొందరు ఆరోపణలపై సమగ్ర విచారణ జరగాలని కోరుతున్నారు. మొత్తానికి, ఈ తాజా ఘటన టాలీవుడ్‌లో క్యాస్టింగ్ కౌచ్ సమస్యను మరోసారి ముందుకు తెచ్చింది. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని సినీ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

Edited, Printed, Published and Owned by Lingabatthini Krishna Printed at Bhavani Enterprises, H.No 16-6-198/B, Perukawada, Warangal, 506002, Telangana State. Published at H.No. 17-3-180, Near Rama Swamy Temple, Warangal Dist, 506002 Telangana State. Editor : Lingabatthini Krishna, Phone : 9701923260. e-Mail : vedhanews22@gmail.com. RNI No : TELTEL/2022/83073